అంతా మా ఇష్టం!

- ఆర్‌అండ్‌బి అధికారుల తీరుపై విమర్శలు
- ఉదయగిరి-నందవరం, సంగం-కలువాయి రోడ్డు టెండర్ల రద్దు
- సింగిల్ టెండర్ పేరుతో క్యాన్సిల్.. మళ్లీ సెకండ్ కాల్
- నెల రోజుల క్రితం ఇదే సింగిల్ టెండర్ల ఆమోదం


వివరాలు 8లో..



నెల్లూరులోని మూలస్థానేశ్వరుడి ఆలయంలో నృత్యం చేస్తున్న విద్యార్థి



రాపూరు : పెంచలకోనలో సౌభాగ్యలక్ష్మిగా ఆదిలక్ష్మి



నెల్లూరు : రాజరాజేశ్వరిగా ఇరగాళమ్మ అమ్మవారు



నెల్లూరు : చండీ అలంకరణలో రాజరాజేశ్వరి



నెల్లూరు రూరల్ : వేదగిరిపై ఆదిలక్ష్మిగా ఆదిలక్ష్మి అమ్మవారు



సంగం : బాలత్రిపురసుందరిగా కామాక్షిదేవి

నవ దుర్గాయై నమః

వైభవంగా శరన్నవరాత్రి వేడుకలు ప్రారంభం

వివిధ అలంకారాల్లో జగన్మాత కనువిందు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు సోమవారం ఉదయం వైభవంగా ప్రారంభ మయ్యాయి. నవదుర్గల అలం కారాల్లో అమ్మవార్లు భక్తులకు దర్శనం ఇచ్చా రు. జైభవానీ, జైజై భవానీ అంటూ భక్తుల నామస్మరణ ఆలయ పరిసరాల్లో మారు మోగింది. తొలిరోజు కలశ స్థాపనతో వే డుకలు ప్రారంభమయ్యాయి. నెల్లూరు లోని కన్యకాపరమేశ్వ రి ఆలయం ఆధ్వర్యంలో 1008 మంది సువాసి నులు ఎర్రటి వస్త్రాలు ధరించి రంగనాథ స్వామి ఘాట్ నుంచి పెన్నానదీ జలాలు సేకరించా రు. అనంతరం వెండి రథంలో కన్యకాపర మేశ్వరిరాగా మంగళవా యిద్యాలు, మేళతాళాలతో జైవాసవీ, జైజై వాసవీ అనే నామస్మరణలతో ఊరేగింపుగా కన్యకాపరమేశ్వరి ఆలయానికి చేరుకున్నారు. కలిశోత్సవంలో పాల్గొన్న ప్రతి మహిళకు కుబేర యంత్రాన్ని బహూకరించా రు. రాజరాజేశ్వరి ఆలయంలో సంపుటీకర ణ, చండీహోమాలు ప్రారంభమయ్యాయి. అలాగే జొన్నవాడ, పెంచలకోన, వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కావ లి కలుగోళమ్మలతోపాటు అన్నీ ఆ లయాల్లో కలిశ స్థాపనలతో ఉ త్సవాలు వైభవం గా ప్రారం భమయ్యాయి. భక్తులు తొలిరోజే ఆలయాల కు పోటెత్తారు.



రాజరాజేశ్వరి ఆలయంలో భక్తుల సందడి

వీఎస్‌యూ విద్యార్థికి రాష్ట్రపతి అవార్డు

వెంకటాచలం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వీఎస్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ ఎం. పృథ్వీరాజ్‌కు రాష్ట్రపతి అవార్డు దక్కడం యూనివర్సిటీకే గర్వకారణంగా ఉందని వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో సోమవారం పృథ్వీరాజ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా వీసీ విలేకరులతో మాట్లాడారు. ఈనెల 29న ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా పృథ్వీరాజ్ ఈ అవార్డును అందుకోనున్నాడని తెలిపారు. మూడేళ్లగా ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన వీఎ్‌సయూ విద్యార్థులకు వరుసగా రాష్ట్రపతి అవార్డులు లభిస్తుండడం విశేషమన్నారు. వీఎస్‌యూ పొందుతున్న ఈ అవార్డులు కేవలం వ్యక్తిగత కృషి ఫలితం మాత్రమే కాదని, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది మధ్య సమన్వయ ఫలితమేనన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కే. సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.



వలంటీర్ పృథ్వీరాజ్‌ను అభినందిస్తున్న వీసీ శ్రీనివాసరావు తదితరులు

జేసీగా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ



నెల్లూరు (హరనాథపురం); సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా జాయింట్ కలెక్టర్‌గా మొగిలి వెంకటేశ్వర్లు సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తహసీల్దారుగా జిల్లాలో పనిచేసిన అనుభవం తనకు ఉందని అన్నారు. నిబంధనల మేరకు తాను పని చేస్తానని, దస్త్రాలు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కస్తామని చెప్పారు. కలెక్టర్ ఆదేశాలు పాటిస్తూ జిల్లా మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

కన్నకొడుకే గూడు లేకుండా చేశాడయ్యా!



ఇంటిని అక్రమంగా రాయించుకున్నాడు!

కలెక్టర్‌కు ఓ వృద్ధురాలి మొర

న్యాయం చేస్తామని బాధితురాలికి హామీ

ఈ వృద్ధురాలి పేరు ఎం.రమాజ్యోతి. కావలిలోని అరటితోట ప్రాంతవాసి. తన కుమారుడు మోసం చేసి ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని వాపోతూ సోమవారం నెల్లూరులోని కలెక్టరేట్‌కు చేరుకుంది. ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన హిమాన్షు శుక్లా ఆ వృద్ధురాలి నుంచి తొలి అర్జీ అందుకున్నారు. నడవలేని స్థితిలో కలెక్టరేట్‌కు చేరుకుని రమాజ్యోతి వద్దకే కలెక్టర్ చేరుకుని ఆమె సాధక బాధకాలు విన్నారు. ఈ సందర్భంగా రమాజ్యోతి మాట్లాడుతూ తన కుమారుడు ఎం. శ్రీనివాసులు మోసం చేసి తన ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు కన్నీటి పర్యంతమైంది. తనకు అన్నం, నీరు కూడా ఇవ్వకుండా చేశాడని వాపోయింది. ఆ ఇంటి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయించి, తన ఇంటిని తనకు చెందేలా చేయాలని కలెక్టర్‌ను ఆ వృద్ధురాలు వేడుకుంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారుల ద్వారా విచారించి సమస్యను వెంటనే పరిష్కరిస్తానని అన్నారు.

- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)

సోమశిల జలాశయానికి 37,212 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో హెచ్చు, తగ్గులుగా కొనసాగుతోంది. సోమవారం 35,847 క్యూసెక్కులు వస్తుండగా, డ్యాంలో నీటినిల్వ 72.250 టీఎంసీలకు చేరుకుంది. దిగువకు వదులుతున్న నీటి మోతాదును తగ్గించారు. మూడు గేట్ల ద్వారా 15,000, పవర్ టెన్నల్ ద్వారా 2,600, ఉత్తర కాలువకు 400, కండలేరుకు వరద కాలువ ద్వారా 10,450 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



ధర తగ్గింది.. కొన్నిచోట్లే!

పాత సరుకు పేరుతో పాత ధరే

- అమలులోకి జీఎస్టీ తగ్గుదల
- ఎలక్ట్రానిక్ బిల్లులున్న చోట మాత్రం అమలులోకి..
- అన్ని వర్గాల్లోనూ వెల్లివిరుస్తున్న ఆనందం



నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జీఎస్టీ (వస్తు వినియోగ పన్ను) సంస్కరణల ప్రభావం జిల్లాలో ఇంకా పూర్తిస్థాయిలో కనిపించడం లేదు. అనేక వస్తువులపై జీఎస్టీ తగ్గినా ఆ ఫలితం సామాన్యులకు అందేందుకు కొంత సమయం పట్టేలా కనిపిస్తోంది. ప్రధానంగా నిత్యావసరాల విషయంలో ఈ పరిస్థితి ఉంది. అయితే, ఎలక్ట్రానిక్ బిల్లులు ఇస్తున్న సూపర్ మార్కెట్లలో మాత్రం నిత్యావసరాల ధరలు తగ్గాయి. ఇప్పటివరకూ కొన్ని రకాల నిత్యావసరాలపై 18 శాతం జీఎస్టీ, మరికొన్ని రకాల నిత్యావసరాలపై 12 శాతం జీఎస్టీ ఉండగా, అది సోమవారం నుంచి 5 శాతానికి తగ్గింది. అంటే ఇప్పటివరకూ అమ్ముతున్న ధరల్లో 13 శాతం ధర తగ్గాల్సి ఉన్నప్పటికీ సాధారణ దుకాణాల్లో పాత సరుకు పేరుతో పాత ధరనే కొనసాగిస్తున్నారు. తమ దగ్గర మరో పది రోజుల వరకూ సరుకు ఉంటుందని, పాత జీఎస్టీ ప్రకారం ఆ సరుకును కొన్నాం కాబట్టి తాము కూడా అదే ధరకు అమ్మకపోతే నష్టం వస్తుందని రిటైల్ వ్యాపారులు చెబుతున్నారు. అయితే పెద్ద సూపర్‌మార్కెట్లలో మాత్రం సోమవారం నుంచి జీఎస్టీ ధరలు తగ్గించారు. ఇక షాపింగ్ మాల్స్, ఎలక్ట్రానిక్ దుకాణాలు, బైకులు, కార్ల షోరూముల్లో తగ్గించిన జీఎస్టీ ధరలు అమల్లోకి వచ్చాయి. ఇక్కడ ఆది, సోమవారాలకు తేడా స్పష్టంగా కనిపించింది. పండుగ సీజన్ కావడంతో షాపింగ్ మాల్స్ కళకళలాడుతున్నాయి. కాగా తగ్గిన జీఎస్టీ ధరల వివరాలు ప్రజలందరికీ తెలిసేలా ప్రతీ దుకాణం ముందు బోర్డులు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. కానీ నెల్లూరులో చాలా చోట్ల వ్యాపారులు బోర్డులు ఏర్పాటు చేయలేదు.



నెల్లూరులోని ఓ షోరూమ్ ముందు జీఎస్టీ తగ్గుదలపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

- **తగ్గిన సబ్బులు, బిస్కట్ల ధరలు**

కొత్త జీఎస్టీ రేట్లతో వస్తువుల ధరలు తగ్గాయి. సబ్బులు, టూత్‌పేస్టులు, పాలు, డైరీ ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఔషధాలు, ఆటోమొబైల్స్, వాషింగ్ పౌడర్లపై జీఎస్టీ తగ్గింది. చిన్నకార్లపై పన్ను కొంత తగ్గించగా, ఎలక్ట్రిక్ వాహనాలపై మరింత పన్ను రాయితీ అందింది. గృహోపకరణాల వంటి వాటిపై పన్ను తగ్గింది. ఉదాహరణకు సబ్బుల మీద ప్రస్తుతం 18 శాతం జీఎస్టీ ఉండగా 5 శాతానికి తగ్గింది. సింథాల్ సబ్బు ధర రూ.50గా ఉండగా, జీఎస్టీ తగ్గుదలతో రూ.45లకు చేరుకుంది. హమామ్ సబ్బు రూ.45 నుంచి 40లకు, 4 లైఫ్‌బాయ్ సబ్బుల ప్యాక్ ధర రూ.68 నుంచి 60కి తగ్గింది. 200 గ్రాముల హార్లిక్స్ ధర రూ.130 నుంచి 110లకు, 200 గ్రాముల కిసాన్ జామ్ ధర రూ.90 నుంచి 80లకు తగ్గింది. జీఎస్టీ తగ్గింపు ధరతో కూడిన కొత్త సబ్బులు మార్కెట్‌లోకి వచ్చాయి. ముఖ అందానికి వినియోగించే పౌడర్ల ధరలు కూడా తగ్గాయి. రూ.150 ఉన్న టాల్కం పౌడర్ డబ్బా 140కి తగ్గింది. స్నానానికి వినియోగించే షాంపుల ధర కూడా దిగి వచ్చింది. ఉదాహరణకు సన్ సిల్క్ షాంపు ఎంఆర్‌పీ రూ.469 ఉంటే జీఎస్టీ తగ్గింపునకు ముందు రూ.430లకు విక్రయించేవారు. సోమవారం రూ.419లకే ఇస్తున్నారు. డవ్ షాంపు 340 ఎంఎల్ ధర రూ.490 ఉంటే, రూ.435లకు తగ్గింది.

- చిన్నకార్లపై ఇప్పటివరకు 22 శాతం జీఎస్టీ ఉండగా, 18శాతానికి తగ్గింది. దీనివల్ల రూ.7లక్షల కారుపై సుమారు రూ.35వేల వరకు తగ్గింది. ఫ్రిజ్‌లపై 18 శాతం ఉన్న జీఎస్టీ 12శాతానికి తగ్గటంతో రూ.20వేల ఫ్రిజ్‌పై రూ.1200 వరకు తగ్గింది. రూ.10వేలు ఉన్న ఓవెన్‌పై రూ.600 తగ్గింది. వాషింగ్ మిషన్‌పై వున్న 18శాతం జీఎస్టీ 12 శాతానికి తగ్గటంతో రూ. 15వేల విలువైన వాషింగ్ మిషన్‌పై రూ.900 తగ్గింది. ఇంటి కొనుగోలు, నిర్మాణ దారులకు జీఎస్టీ ద్వారా భారీగా ప్రయోజనం కలగనుంది. వీటిపై 28 శాతంగా ఉన్న జీఎస్టీ 18శాతానికి తగ్గింది. దీంతో నిర్మాణ ఖర్చు తగ్గింది.

కొనుగోళ్లు పెరుగుతున్నాయ్!



జీఎస్టీ తగ్గింపును అమలు చేస్తున్నాం. ఇప్పటికే సబ్బులు, పౌడర్‌లు జీఎస్టీ తగ్గింపు ధరలతో వచ్చాయి. అయితే బిస్కట్లు తదితరాలపై ధర పెంచకుండా వాటి బరువు పెంచి బిస్కట్లు తయారై వస్తున్నాయి. దీంతో బరువు పెరిగిన బిస్కట్ జీఎస్టీ తగ్గిన ధరకే వస్తుంది. జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రయోజనం ఏమీ లేదని కొందరు అనటం సరికాదు. జీఎస్టీ తగ్గింపు వల్ల వినియోగదారుకు వస్తువుల ధరలు తగ్గుతాయి. అమ్మకాలు పెరడం వల్ల వ్యాపారి కూడా ఆనందపడతాడు.

- వాకాటి శేఖర్, నెల్లూరు

ధరలు తగ్గడం మంచిదే



నిత్యావసర వస్తువుల ధరలు తగ్గితే మాలాంటి చిన్న వ్యాపారులకు ఎంతో మేలు. ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడం శుభపరిణామం. నిత్యావసర ధరలు అధికంగా ఉండడంతో హోటల్ నిర్వహణ ఖర్చు కూడా పెరిగి ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పుడు ఖర్చులు తగ్గుతాయి.

- షేక్ సందానీ, ఉదయగిరి


బైక్ కొంటాను!



ఎప్పటినుంచో బైక్ కొనాలనుకుంటున్నా. కానీ జీఎస్టీ కారణంగా ధరలు అధికంగా ఉండడంతో కొనుగోలు చేయలేక పోయాను. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ ధరలు తగ్గించడంతో కొత్త బైక్ కొనుగోలు చేస్తా.

- దారపనేని నారాయణ, సర్వరాబాదు, ఉదయగిరి

ఆర్థిక వెసులబాటు



కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో నిత్యవసర వస్తువుల ధరలు తగ్గుముఖం పడితే మాలాంటి దిగువ మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక వెసులుబాటు కలిగినట్టు అవుతుంది. అయితే ప్రస్తుతం వస్తువుల రేట్లు పాత ధరలకే విక్రయిస్తున్నారు. జీఎస్టీ రేట్లు తగ్గింపు పూర్తిస్థాయిలో కొనసాగాలంటే కొన్ని రోజులు పడుతుందని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో ఉన్న రేట్ల ప్రకారమే వస్తువులు అమ్ముతున్నారు.

- నాళం నారాయణరావు, కందుకూరు

- ఆంధ్రజ్యోతి బృందం

శ్రీ పంచపట్టాభ రామస్వామి దేవాలయము

లక్కరాజుగార్లపాడు గ్రామం, సత్తెనపల్లి మండలం, పల్నాడు జిల్లా

e-Procurement Tender

NIT.NO. P/COE/1117/2025, Dt : 05-09-2025

దేవాలయ పున:నిర్మాణము కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు **www.apeprocurement.gov.in** వెబ్‌సైట్‌ను చూడలగరు.

ఇట్లు
కార్యనిర్వహణాధికారి



నేడు పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం

పొదలకూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు గ్రామ దేవత, శక్తిస్వరూపిణి శ్రీపోలేరమ్మ దేవాలయ 13వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాణ దాత ఊకోటి లక్ష్మీనారాయణ తెలిపారు. ఉదయం నుంచి సుప్రభాతం, పంచామృతాభిషేకం, వివిధ రకాల అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని, మధ్యాహ్నం అన్నదానం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10722
వెండి కిలో ధర	రూ. 138200
వెండి ఒక గ్రాము	రూ. 141.20



'పల్లె వనాల' ఏర్పాటుకు ప్రోత్సాహకాలు

● బద్దెపూడి మధు, ఏపీవో, ఎన్ఆర్ఈజీఎస్

ముత్తుకూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : 'పల్లె వనాల' ఏర్పాటుకు ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద ప్రోత్సాహకాలు అందిస్తోందని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో బద్దెపూడి మధు తెలిపారు. పల్లె వనాల ఏర్పాటు ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసుకునేందుకు ట్రాక్ అందుబాటులో ఉంటుందన్నారు.

?. 'పల్లె వనం' ఏర్పాటుకు ఎంత సాయం అందజేస్తారు

!. కనీసం 20 సెంట్ల నుంచి 3 ఎకరా లలో పల్లె వనాలను ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రభుత్వం 20 సెంట్ల స్థలం లో పార్కు ఏర్పాటుకు రూ.2 లక్షల వరకు అందజేస్తుంది. దీనిపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు అవగాహన కల్పించాం.

?. పండ్లు, పూలతోటల సాగుకు సాయం అందిస్తున్నారా

!. పండ్లు, పూల తోటల సాగు చేసే రైతులకు జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేయూతనందిస్తున్నాం. మామిడి, నిమ్మ, చీనీ మొదలైన పండ్ల తోటల సాగు కు ఎకరాకు రూ. లక్ష వరకు నిధులు మంజూరు చేస్తారు. మూడేళ్లపాటు నిర్వహణ ఖర్చులు, గులాబీ, మల్లె తోటల సాగుకు 'ఉపాధి' పథకం నిధులు అందుతాయి.

?. మండలంలో ఉపాధి పనుల పరిస్థితి ఏంటి

!. మండలంలోని 15 పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. వారంలో రూ.5 లక్షల మేర ఉపాధి పనులు కల్పిస్తున్నాం. మండలంలో 100 గోకులాల ఏర్పాటుకు నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాం.

ప్రభుత్వ భూముల ఆక్రమణ యత్నం

మర్రిపాడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తుండటంతో ప్రభుత్వ భూములను దున్నేందుకు మండలంలో అక్రమార్కులు బరితెగించారు. సోమవారం అల్లంపాడు రెవెన్యూలో 1083, 1081 సర్వే నెంబర్లలోని సుమారు 20 ఎకరాల భూమిని ఆక్రమించేందుకు కొందరు జేసీబీ సహాయంతో కంపచెట్లను తొలగించారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు ఆర్ఐ సాయికిరణ్, సర్వేయర్ సుదర్శన్ అక్కడికి వెళ్లి అడ్డుకున్నారు. ఆక్రమణకు యత్నిస్తున్న వారిని హెచ్చరించి జేసీబీని అక్కడ నుండి పంపించేశారు.

దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దు

ఆత్మకూరు : పట్టణంలో దసరా సెల వుల్లో తరగతులను నిర్వ హిస్తుండ డంతో ఆంధ్రవిద్యార్థి సంఘం నాయ కులు సోమవారం పాఠశాలలకు వెళ్లి తరగతులను అడ్డుకున్నారు. సోమ వారం నుంచి 2వ తేదీవరకు దరసరా సెలవులు. అయితే ఆత్మకూరు పట్టణంలో పలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠ శాలలు తరగతులు నిర్వ హిస్తుండ డంతో ఆంధ్ర విద్యార్థి సం ఘం జిల్లా అధ్యక్షుడు మహంత్ రెడ్డి ఆధ్వర్యంలో తరగతు లను అడ్డుకుని ఆందోళన చేశారు.

జీఎస్టీ తగ్గింపుపై ఎల్ఐసీ ఉద్యోగుల హర్షం



ఎల్ఐసీ కార్యాలయంలో కేక్‌కట్ చేసి హర్షం చేస్తున్న ఉద్యోగులు

ఆత్మకూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ బీమా ప్రీమియంలో జీఎస్టీ తగ్గింపు పై ఆసంస్థ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భ ంగా వారు స్థానిక ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకత్వం ఆదేశాల మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు వారు కృతజ్ఞ తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బ్రాంచ్ మేనేజర్ సీహెచ్ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ మేక్ఇన్ ఇండి యా మేడ్ ఇన్ ఇండియాను ప్రజలకు అలవాటు చేయడానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ జీఎస్టీ తగ్గింపు చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి బ్రాంచ్ కార్యదర్శి శ్యాం ప్రభాకర్, ఎల్ఐసి బ్రాంచ్ ప్రెసిడెంట్ టి రమేష్, లియపీ ఆత్మకూరు బ్రాంచ్ ప్రెసిడెంట్ పడచల శ్రీనివాసులు యాదవ్, బ్రాంచ్ సెక్రటరీ ఎం శ్రీనివాసులు రెడ్డి, లియోపి ట్రెజరర్ ఓబుల్‌రెడ్డి, మాల్యాద్రి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లీ దుర్గమ్మా.. చల్లంగ చూడమ్మా!

● పోటాపోటీగా దేవీ శరన్నవరాత్రులు

● 11 రోజుల పాటు నిర్వహణ



మనుబోలులో రెండుచోట్ల దుర్గాదేవీ గ్రామోత్సవం(ఫైల్)

మనుబోలు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మనుబోలులో పోటాపోటీగా మనుబోలు, కోదండరామపురం ప్రాంతాల్లో దేవీ శరన్నవరాత్రులు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది బుధవారం నుంచి ఉత్స వాలు ప్రారంభం కానున్నాయి. పూర్వీకుల కాలం నుంచి మనుబోలులో పార్వతమ్మ శిల ప్రతిష్ఠించి ఉండడంతో, శిల పరిసర ప్రాంతాల్లో కేటాయించిన స్థలంలో దసరాచావడి నిర్మాణం చేసి అక్కడనే ప్రతి ఏటా దేవి శరన్నవరాత్రులు నిర్వహిస్తుంటారు. కాలక్రమేణ కోదండరామపురం అభివృద్ధి చెంది వ్యాపారకూడలిగా మారింది. దీంతో ఆ ప్రాంతంలోనూ దేవి శరన్నవరాత్రులు నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే రెండుచోట్ల కలశస్థాపనలు కాని, నిమజ్జనాలు కాని ఒకే రోజు చేస్తుంటారు. రెండుచోట్ల దుర్గాదేవి గ్రామోత్సవాలు ఒకేరోజు నిర్వహించడం కారణంగా సందడి వాతావరణం ఉంటుంది. ఈ వేడుకలు చూసేందుకు మనుబోలు సమీప గ్రామాల నుంచి వందల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. అంతేగాకుండా దుర్గాదేవిని ఎక్కడ భారీగా అలంకరించారు. ఎక్కడ ఘనమైన కార్యక్రమాలు ఉన్నాయని, భక్తులు ఉత్సాహంగా రెండుచోట్ల దుర్గాదేవీలను దర్శించుకుంటారు. ఇందుకోసం రెండుచోట్ల దసరాకమిటీ నిర్వాహకులు 11రోజుల పాటు అహర్నిశలు శ్రమించి అమ్మవారి పూజా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలను వేడుకగా ఏర్పాటుచేస్తారు.

రాపూరు: పెంచలకోన క్షేత్రంలో పెంచల నృసింహుడి పట్టమహిషి ఆదిలక్ష్మీ అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సోమవారం కలశ స్థాపనతో వైభవంగా ప్రారంభమయ్యాయి. మూలవిరాట్‌ను బంగారు చీరలో విశేషంగా అలంకరించి, అర్చకులు కలశస్థాపన చేసి పూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవారు సౌభాగ్యలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తిరు ఆలయం వద్ద విద్యుద్దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంటోంది. ఈ కార్యక్రమాలు ఆలయ ఉపకమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు. అలాగే పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో కలశ స్థాపన, ఊరేగింపు దేవస్థాన ప్రెసి డెంట్ మెంటా నారాయణశెట్టి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. రాత్రికి అమ్మవారు బాలాత్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

పొదలకూరు: మండలవ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉదయం కలశస్థాపన, ప్రాణప్రతిష్ఠ, లలితా సమస్ర నామార్చన, ఖడ్గమాల, త్రిశతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉభయకర్తగా ఆదూరు వెంకటసుబ్బయ్య వ్యవహరించారు. రాత్రి కన్యకా పరమేశ్వరి దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అయ్యగారిపాలెం పార్వతీ దేవి ఆలయం, శివాలయంలోని కామాక్షితాయి ఆల యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభ మయ్యాయి.



రాపూరు పురవీధుల్లో కలశాన్ని ఊరేగిస్తున్న ఆర్యవైశ్యులు



పొదలకూరులో కలశాలతో భక్తులు

ఇందుకూరుపేటలో 'స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్'



ఇందుకూరుపేట వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది



చిన్నారికి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

ఇందుకూరుపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇందుకూరుపేట శ్రీలక్ష్మీనర సింహ స్వామి దేవస్థానం ఆవరణలో సోమ వారం 'స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ పథకం ద్వారా ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందిం చేందుకు సోమవారం వైద్య శిబిరం నిర్వహిం చారు. మహిళలకు ఎన్‌సీడీ స్క్రీనింగ్, హెచ్‌బీ, బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వ హించారు. వరల్డ్ రోజ్ డే (క్యాన్సర్ బాధితుల స్వాంతన దినం) సందర్భంగా వివిధ రకాల క్యాన్సర్లపై అవగాహన కల్పించారు. స్క్రీనిం గ్‌లు చేశారు. పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు. మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ కిశోర్ కుమార్, డాక్టర్ బ్రహ్మేశ్వర్ నాయుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సుధాకర్ రావు, హెచ్‌ఈఓ శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్లు రమ, సతీష్‌బాబు, హెల్త్ అసి స్టెంట్లు మాధవ, సుధాకర్, సీహెచ్‌ఓలు, ఏఎన్ ఎంలు, ఆశా వాలంటీర్లు పాల్గొన్నారు.

వెంకటాచలం : మహిళల ఆరోగ్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలుగురైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, చవటపాళెం సొసైటీ ఛైర్మన్ రావూరి రాధాకృష్ణమ నాయుడు అన్నారు. వెంకటా చలంలోని సామాజిక వైద్యఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో సోమవారం 'స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై టీడీపీ మండలాధ్యక్షుడు కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ చల్లా నాగార్జున రెడ్డిలతో కలిసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కుటుంబ బాధ్యతల్లో నిమగ్నమై చాలామంది మహిళలు తమ ఆరోగ్యం పై శ్రద్ధ పెట్టడం లేదన్నారు. కొందరు క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులను ముందుగా గుర్తించకపోవడం వల్ల ప్రాణాలు పోగొట్టుకుం టున్నారన్నారు. ప్రభుత్వం మహిళల ఆరో గ్యాన్ని కాపాడాలన్న సంకల్పంతో 'స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమాన్ని చేపట్టిందని ఆయన తెలిపారు. మహిళలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ కుటుంబా నికి రూ.25 లక్షల వరకు వైద్య చికిత్సల ఖర్చును ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ భరించేలా ప్రణాళిక అమలు చేస్తోందన్నారు. కార్యక్ర మంలో జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బే పల్లి సురేష్‌నాయుడు, సీహెచ్‌సీ మెడికల్ ఆఫీ సర్ డాక్టర్ పరశురాం, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యురాలు శ్రీనితారెడ్డి, టీడీపీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక కమిటీ ఎంపిక



పొదలకూరు, సెప్టెంబరు 22 (ఆంధ్ర జ్యోతి) : జన విజ్ఞాన వేదిక మండల నూత న కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. మండల స్థాయి జన విజ్ఞాన వేదిక ప్రాంతీ య సదస్సును పొదలకూరులోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్య క్రమంలో జేవీవీ జిల్లా, మండల కమిటీల బాధ్యులు, యూటీఎఫ్ కార్యకర్తలు పాల్గొ న్నారు. ఈ సమావేశంలో పొదలకూరు మండల జేవీవీ కమిటీ అధ్యక్షుడిగా బీ శీనయ్య, జనరల్ సెక్రటరీగా బీవీవీ కళ్యాణ్, గౌరవాధ్యక్షుడిగా నారాయణరెడ్డి, ఉపాధ్యక్షు లుగా ఆర్ పోలయ్య, ఎం రవి, కోశాధికారిగా ఏ నాగయ్య, కార్యదర్శులుగా నారాయణ, కోడూరు వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. అనంతరం జన విజ్ఞాన వేదిక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి సలహాలు, సూచ నలు ఇచ్చారు.

మృతుల కుటుంబానికి సీపీఐ నేతల పరామర్శ



మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీపీఐ నాయకులు

ఇందుకూరుపేట, సెప్టెంబరు 22 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని అరుంధతివాడలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన చల్ల గుంట్ల శ్రీనివాసులు, లక్ష్మి దంపతుల పిల్ల లు, కుటుంబసభ్యులను సోమవారం సీపీఐ నాయకులు పరామర్శించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షానవాజ్, సిరాజ్ మాట్లా డుతూ శ్రీనివాసులు, లక్ష్మీ దంపతులు పెర మన వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెంద డం బాధాకరమన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వం రూ. 25 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు షాజహాన్, మున్వర్, శేష య్య, నరసయ్య, చనిపోయిన వారి పిల్లలు చంద్రప్రియ, విశ్వంత్ పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

సీతారామపురం, సెప్టెంబరు 22 (ఆంధ్ర జ్యోతి): రైతులందరికీ తగినంత యూరియా అందుబాటులో ఉందని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మారం రెడ్డిపల్లి సొసైటీ అధ్యక్షుడు సోమనబోయిన రాజశేఖర్ అన్నారు. మండల పరిధిలోని అయ్యవారిపల్లి రైతుసేవా కేంద్రంలో సోమవారం సొసైటీ ఛైర్మన్ సోమనబోయిన రాజశేఖర్, డైరెక్టర్లు రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు యూరియా కోసం ఆందోళన చెందవద్దని, కావలసినంత యూరియా అందు బాటులో ఉందని సూచించారు. యూరియాను అధిక మోతాదులో వాడటం పంటకు మంచిది కాదని, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మాత్రమే వాడాలని తెలిపారు. ఈకార్యక్రమంలో టీడీపీ మాజీ కన్వీనర్ ముత్తంశెట్టి చెన్నకేశవులు, సర్పంచ్ వెంకటసుబ్బయ్య, రమణయ్య, తోట ఏడుకొండలు, సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

రైతులను విస్మరించిన ప్రభుత్వం

మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి

వెంకటాచలం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతులను కూటమి ప్రభుత్వం విస్మరించిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. మండలంలోని తాటిపర్తిపాళెం వద్ద రైతులు పండించి, అమ్ముకోలేక ఆరబెట్టుకుంటున్న ధాన్యాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో రైతుల పరిస్థితి దయనీయంగా తయారైందన్నారు. రైతులు యూరియా కోసం అవస్థలు పడుతున్నారన్నారు. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర అందక, రైతులు అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్లే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులను దళారులు ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారన్నారు. చంద్రబాబు మాటలు చెప్పడం తప్ప రైతులు పండించిన పొగాకు, టమోటో, పత్తి, మామిడి, ధాన్యం, ఉల్లి పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో వ్యవసాయం అధోగతి పాలైందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోదండరామిరెడ్డి, వైసీపీ నేతలు మందల వెంకటశేషయ్య, వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, మోహన్‌నాయుడు, భాస్కర్‌నాయుడు, శివకుమార్‌రెడ్డి, దేగా శ్రీనివాసులు, కిషోర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

ఉద్రిక్తతల నడుమ పసిబిడ్డకు పోస్టుమార్టం

● కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు



ఆసుపత్రిలోకి కుటుంబ సభ్యులను వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్న పోలీసులు

ఉదయగిరి, సెప్టెం బరు 22 (ఆంధ్రజ్యో తి): ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం లో వైద్యుడి నిర్లక్ష్యంతో మృతిచెందిన పసిబిడ్డ మృత దేహానికి ఉద్రి క్తతల నడుమ సోమ వారం పోలీసులు పోస్టుమార్టం నిర్వహించారు. వైద్యుడి నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ చనిపోయిందంటూ తండ్రి చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసిన విషయం విదితమే. అందులో భాగంగా ఉన్నతాధికారుల సూచన మేరకు నెల్లూరు మెడికల్ కళాశాలకు చెందిన ఫోరెన్సిక్ వైద్యుడిని ఉదయగిరికి పిలిపించి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

● **కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు**

వైద్యులచే పరీక్షించి పసిబిడ్డ మృతదేహాన్ని అప్పగిస్తామని తొలుత పోలీసులు చెప్పారని, మాటమార్చి ప్రస్తుతం పోస్టుమార్టం చేయడం ఏమిటని, దానికి తాము అంగీకరించమని కుటుంబ సభ్యులు ముక్తకంఠంతో నినదించారు. పోస్టుమార్టం చేసేపనైతే తమకు కేసు అవసరంలేదని, బిడ్డను అప్పగిస్తే తీసుకెళతామంటూ తెగేసి చెప్పారు. దీంతో సీఐ వెంకటరావు, ఎస్ఐలు ఇంద్రసేనారెడ్డి, శివకృష్ణారెడ్డిలు సమస్య పైస్థాయి వరకు వెళ్లిందని, కేసు నమోదైందని, పోస్టుమార్టం నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తే వైద్యునిపై చర్యలు తీసుకుంటారని కుటుంబ సభ్యులకు వివరించారు. అయినా వారు ససేమిరా అంటూ మీ కాళ్లుమొక్కుతాం సార్.. తల్లికి బిడ్డ చనిపోయాడని చెప్పలేదని, ఆరోగ్యం సరిగాలేక నెల్లూరు తీసుకెళ్లారని చెప్పామని, ఒక్కసారి బిడ్డ ఒంటిపై గాటు లేకుండా అప్పగిస్తే తమ కుమార్తెకు చూపించి తిరిగి ఇస్తామంటూ కన్నీరుమున్నీరయ్యారు. అయినప్పటికీ పోలీసులు పోస్టుమార్టం చేయకుండా బిడ్డను అప్పగించడం కుదరదని, తమకు సహకరించాలని, కుటుంబ సభ్యు లతో సామరస్యంగా మాట్లాడి ఒప్పించారు. పోస్టుమార్టం అనంతరం బిడ్డను కుటుంబ సభ్యులకు అప్పగించడంతో వారు కాన్పయిన తల్లికి బిడ్డను చూపించి చనిపోయిన విషయం తెలిపి ఇంటికి తీసుకెళ్లారు.

కండలేరు కాలువలో ఒకరి గల్లంతు

కలువాయి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): సోమశిల కండలేరు వరద కాలువలో ప్రమాదవశాత్తు పడి ఒకరు గల్లంతైన సంఘటన సోమవారం కలువాయి మండలం కేశమనేనిపల్లి సమీపంలో చోటు చేసుకుంది. గ్రామస్థుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కేశమనేనిపల్లి ఎస్టీ కాలనీకి చెందిన చల్లంచర్ల శీనయ్య, అతని తమ్ముడు కలసి సోమవారం మధ్యాహ్నం పొలం పనులకు వెళ్లారు. అక్కడ పనిలేకపోవడంతో తిరిగి వస్తూ సమీపంలోని కండలేరు కాలువలో చేపల కోసం దిగారు. ప్రమాదవశాత్తు ఇద్దరూ నీటిలో జారిపడ్డారు. చుట్టుపక్కల వారు శీనయ్య తమ్ముడిని మాత్రం తాడు అందించి రక్షించారు. శీనయ్య ప్రవాహంలో గల్లం తయ్యాడు.

సిమెంటు లారీ బోల్తా



బోల్తా పడిన సిమెంట్ లారీ

వింజమూరు, సెప్టె ంబరు 22 (ఆంధ్రజ్యో తి): పాతూరు చెరువు కట్టపై సోమవారం జ మ్మలమడుగు నుంచి కావలికి వెళ్తున్న సిమెంటు లారీ బోల్తాప డింది. ఎదురుగా వస్తు న్న ట్రావెల్ బస్సు సైడ్ ఇవ్వకపోవడంతో బోల్తా పడిందని ఎస్ఐ వీరప్రతాప్ తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదని ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థినుల అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చిన్న బజారు పోలీసుస్టేషన్ పరిధిలో ఇద్దరు విద్యార్థినుల అదృశ్యంపై సోమవారం కేసులు నమోదయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు.. కలువాయి ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థిని వీఆర్సీ కూడలిలోని ఓ కాలేజీలో సీనియర్ ఇంటర్ చదువుతోంది. ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్న ఆ విద్యార్థిని ఈ నెల 21వ తేదీ సాయంత్రం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో వార్డన్ కుటుంబసభ్యులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. చుట్టుపక్కల గాలించినా విద్యార్థిని ఆచూకీ తెలియక పోవడంతో సోమవారం తండ్రి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

● బుచ్చిరెడ్డిపాలెం మండలం మినగల్లుకు చెందిన మరో విద్యార్థిని నగరంలోని వాహెబ్‌పేటలో ఓ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. అదే కాలేజీ హాస్టల్‌లోనే ఉంటోంది. ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం హాస్టల్ వార్డెన్‌కు ఓ వ్యక్తి ఫోన్ చేసి కుటుంబ సభ్యుడిలా మాట్లాడుతూ విద్యార్థిని ఇంటికి పంపాలని కోరాడు. దీంతో ఆమె హాస్టల్ నుంచి వెళ్లిపోయింది. అయితే, తల్లిదండ్రులు సాయంత్రం ఫోన్ చేయడంతో అసలు విషయం బయటపడింది. దీంతో వారు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మొక్కజొన్న రైతు విలవిల

ఉదయగిరి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): వర్షాభావ పరిస్థితులు, పెరిగిన పెట్టుబడులు, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని రేయింబవళ్లు కష్టించి సాగు చేసిన పంట తీరా చేతికందే సమయంలో దిగుబడి రాక, మద్దతు ధర లేక కర్షకుడు కుదేలవుతున్నాడు. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం, బహిరంగ మార్కెట్‌లో ఆశించిన మేర ధర లేకపోవడంతో పంట సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా కష్టమేనంటూ మొక్కజొన్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● **160 ఎకరాల్లో సాగు**

ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలో మెట్ట పంటలు అత్యధికంగా సాగు చేస్తారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో 160 ఎకరాల్లో పంట సాగు చేశారు. ప్రస్తుతం కోతలు ముగిసి పంట విక్రయానికి రైతులు సిద్ధంగా ఉన్నారు. ఎకరా మొక్కజొన్న పంటకు దున్నకం, విత్తనాలు, మందులు, పంట కోత తదితరాలు కలిపి రూ.20 నుంచి రూ.25 వేల పెట్టుబడి అవుతుందని రైతులు తెలుపుతున్నారు. ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ఈ ఏడాది 10 నుంచి 15 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి రావడం, క్వింటా రూ.2,000 నుంచి రూ.2,200 పలుకుతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. ఏడాదికేడాది పంట సాగుకు పెట్టుబడులు పెరగడం, దిగుబడులకు మద్దతు ధర లేకపోవడంతో పంట సాగు తగ్గుతోందంటున్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	128
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	256

కోడిగుడ్ల ధర (100): 560

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ తగ్గింపు విషయ మై టీడీపీ నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి సోమవారం నగరంలోని ములుమూ డి బస్టాండ్ ప్రాంతంలో ప్రజలకు, వ్యాపారులకు అవగా హన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాక ర్‌రెడ్డి ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. జీఎస్టీ తగ్గింపుతో కలిగే ప్రయోజనాలను వివరించామని తెలిపారు.



న్యూస్ బాక్స్

న్యాయవాది శ్రీనివాసులు మృతి

నెల్లూరు (లీగల్), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : న్యాయవాది చింతగుంట శ్రీనివాసులు అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష ఉపాధ్యక్షులు పులిమి అయ్యప్పరెడ్డి, జల్లి పద్మాకర్, ప్రధాన కార్యదర్శి నక్కల నాగరాజు, ఐలు జిల్లా కమిటీ సంతాపం ప్రకటించాయి. పలువురు న్యాయవాదులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

అలీస్ వైద్యశాలలో అగ్నిప్రమాదం

- ప్రాణాలకు తెగించి మంటలార్పిన ఫైర్ సిబ్బంది

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్2 థియేటర్స్ సమీపంలో ఉన్న అలీస్ స్పెషాలిటీ వైద్యశాలలో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వైద్యశాల వద్దకు చేరుకున్నారు. భవనం నాల్గో అంతస్తులో మంటలు వ్యాపిస్తుండటాన్ని గమనించిన లీడింగ్ ఫైర్‌మన్ సీహెచ్ నారాయణ అతి కష్టం మీద అక్కడికి చేరుకున్నారు. ఆరు బయట గ్యాస్ సిలిండర్‌తో వంట చేసుకుంటుండగా గ్యాస్ లీకేజీతో అగ్నిప్రమాదం సంభవించినట్లు గుర్తించి అగ్నిమాపక చర్యలు చేపట్టారు. అగ్నిప్రమాదం విషయం తెలుసుకున్న డీఎఫ్‌వో శ్రీనివాసులు రెడ్డి, ఏడీఎఫ్‌వో శ్రీనాథ్‌రెడ్డి, సిబ్బంది కిరణ్, రామకృష్ణ, సుధాకర్‌రెడ్డి, రాఘవేంద్ర రావు తదితరులు పాల్గొని మంటలను పూర్తిగా అదుపు చేశారు.

'డీకేడబ్ల్యూ'లో ఫుడ్ ఎగ్జిబిషన్

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం బయోటెక్ విభాగం ఆధ్వర్యంలో అగ్రికల్చర్ అండ్ న్యూట్రీషియన్ ల్యాబ్ ఎక్స్‌పో పేరుతో ఫుడ్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఫుడ్ ప్రాసెసింగ్ పద్ధతిలో ఆహార పదార్థాలు తయారు చేసి స్టాల్స్ ఏర్పాటు చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమణరావు స్టాల్స్‌ను పరిశీలించి విద్యార్థినులు తయారు చేసిన ఆహార పదార్థాలను కొనుగోలు చేశారు. వారిని అభినందించారు. అనంతరం న్యాయ నిర్ణేతలు కళాప్రియ, కరుణశ్రీ, మసూద్‌లు ఆహార పదార్థాలను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎస్ ప్రియాంక, ఆర్ మహిత, తదితరులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలో సామాన్లు కొనుగోలు చేసేందుకు వచ్చిన వృద్ధుడు అనారోగ్యంతో మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు... అల్లీపురం ప్రాంతానికి చెందిన నరసింహ(74) సౌత్‌రాజుపాలెంలో నివాసం ఉంటున్న వరుసకు కుమార్తె అయిన రహేలు వద్ద ఉంటున్నారు. నరసింహకు అప్పుడప్పుడు మూర్ఛ వ్యాధి వస్తుండటంతోపాటు అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. సోమవారం ఆయన గ్రామస్తుడితో కలిసి ఇంటి సామాన్ల కోసం నగరానికి వచ్చారు. సుబేదారుపేటలో సామాన్లు తీసుకుంటున్న సమయంలో మూర్ఛ వ్యాధి రావడంతో అక్కడే కుప్పకూలి పోయాడు. సమాచారం అందుకున్న కుమార్తె రహేలు, భర్తతో కలిసి సంఘటన స్థలానికి చేరుకోగా అప్పటికే మృతి చెందాడు. సంతపేట పోలీసులకు సమాచారం అందించడంతో వారు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వైఎంసీఏ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ దర్గామిట్ట ఫీడర్‌లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఎం శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.

మాతాశిశు సంరక్షణపై అవగాహన

బిట్రగుంట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం తాళ్ళూరులో కోవూరుపల్లి పీహెచ్‌సీ వైద్యులు రామకృష్ణ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మాతా శిశు సంరక్షణపై సీహెచ్‌వో నజీమునీసా, అంగన్వాడీ సూపర్‌వైజర్ సుప్రజ అవగాహన కల్పించారు. డాక్టర్ రామకృష్ణ ఆరో గ్య, అంగన్వాడి, ఆశా వర్కర్లచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నాగులవరం పీఏసీఎస్ డైరెక్టర్ లక్కాకుల మాధవరావు, స్థానిక నేతలు శ్రీనివాసులు, జయరామయ్య పాల్గొన్నారు.



కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పుష్పాలంకారం



స్టోన్‌హౌస్‌పేట వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నవదుర్గ అలంకరణ



రాజరాజేశ్వరి ఆలయంలో కలశ స్థాపన పూజ

జయ జయహే జగన్మాత!

- వైభవంగా దేవీ శరన్నవరాత్రులు
- చండీ అలంకారంలో రాజరాజేశ్వరి అమ్మవారు

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దేవీ నవరాత్రి ఉత్సవాలు సోమవారం నగరంలోని ఆలయాల్లో వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులను అనుగ్రహించారు.

- రాజరాజేశ్వరి అమ్మవారు చండీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఉదయం దేవీ నవరాత్రి ఉత్సవాలకు కలిశ స్థాపన జరిగింది. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సతీమణి సుజితమ్మ, ఉభయ కర్త ఆల్తూరు గిరీష్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం విశేష నవావరణ, కన్య పూజ, సంపుటీకరణ చండీ హోమం జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు రఘురామశర్మ, సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. నగర కమిషనర్ నందన్ ఆలయ పరిసరాల్లో పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు.
- స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి కాత్యాయినీదేవి అలంకారం జరిగింది. ఉదయం రంగనాథ ఘాట్ నుంచి 1008 మంది మహిళలు పెన్నా జలాలతో కలిశాలను ఊరేగింపుగా దేవస్థానమునకు చేర్చారు. ఆ జలాలను స్వయంగా దర్పణ దర్శనంలో కన్యకా పరమేశ్వరికి అభిషేకాలు చేశారు. మూలవిరాట్‌కు పూలంగి సేవ, సహస్ర దీపాలంకరణ సేవ భక్తులకు కనువిందు చేశాయి. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు అలంరించాయి. ఆలయ చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు పేగు షణ్ముఖరావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.
- గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారు రాజరాజేశ్వరి అలంకారంలో దర్శనమిచ్చారు. విశేష పూజలతో కలిశ స్థాపన జరిగింది. పూలంగిసేవ, సామూహిక కుంకుమ పూజలు, పల్లకీసేవ జరిగాయి. ఆలయ చైర్మన్ ఒట్టూరు సురేంద్ర యాదవ్, ఈవో వీ గిరికృష్ణ పర్యవేక్షించారు.
- మూలస్థానేశ్వరాలయంలో భువనేశ్వరి అమ్మవారు భవానీ అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. కలిశ స్థాపన, విశేష పూజలు, హోమాలు జరిగాయి. ఈవో అర్వభూమి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.
- బాలాజీనగర్ సీతారామమందిరంలో ఉదయం కలిశ స్థాపన, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.
- మూలాపేట శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయంలో రాత్రి కలిశ స్థాపనతో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మూలవర్లకు పూలంగిసేవ జరిగింది. ఆలయ ఈవో జానకమ్మ పర్యవేక్షించారు. నవాబుపేట శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయంలో సాయంత్రం కలిశ స్థాపన జరిగింది. బాల త్రిపుర సుందరీ అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కంచి జ్ఞానేంద్ర, సాదా నాగేంద్ర, శ్రీనివాసులు, కృష్ణమోహన్ పర్యవేక్షించారు.
- కోదండరామపురం మహాలక్ష్మి ఆలయంలో కలిశ స్థాపన, గాయత్రి అలంకారం జరిగాయి. ఆలయ చైర్మన్ పత్తి నరసింహం, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.
- పప్పులవీధి మహాలక్ష్మి ఆలయంలో కలిశ స్థాపన, లక్ష్మీదేవి విశ్వరూపం అలంకారం, ఊంజల్ సేవ జరిగాయి.
- పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గోవిందమాంబ, గాయత్రీదేవిలకు శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కలిశ స్థాపన, విజయదుర్గా అలంకారం జరిగాయి. నెల్లూరు పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కందుకూరు చెంగయ్యఆచారి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.
- అయ్యప్పగుడిలోని గురువాయురప్పన్ మహావిష్ణువు ఆలయంలో ఆదిలక్ష్మి అమ్మవారికి మహాలక్ష్మి అలంకరణ జరిగింది.
- పప్పులవీధి సిద్ధివిఘ్నేశ్వరాలయంలో కామాక్షితాయి బ్రహ్మోత్స వాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం విశేష పూజల అనంతరం ఆస్థాన మండపంలో బాలత్రిపుర సుందరీ అలంకారం జరిగింది.
- **వేదగిరి క్షేత్రంలో....**

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దేవీ శరన్నవరాత్రి వేడుకలు వేదగిరి క్షేత్రంలో వైభవంగా మొదలయ్యాయి. సోమవారం తొలి రోజు లక్ష్మీనరసింహ స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆదిలక్ష్మి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈవో గోపి, ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు పర్యవేక్షించారు. భద్రత ఏర్పాట్లను రూరల్ సీఐ వేణు తన సిబ్బందితో పర్యవేక్షించారు.



మూలస్థానేశ్వర ఆలయంలో బాలికల నృత్య రూపకం



అయ్యప్పగుడిలోని గురువాయురప్పన్ ఆలయంలో ఆదిలక్ష్మి అమ్మవారికి మహాలక్ష్మి అలంకారం

టిడ్కో ఇంటి కోసం దరఖాస్తు చేసుకోండి

- నగర పాలక సంస్థ కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : టిడ్కో ఇల్లు అవసరమున్న వారు దరఖాస్తు అందచేయాలని నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ నందన్ కోరారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో పాల్గొన్న ఆయన నగర వాసుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 పథకంలో భాగంగా ఇంటిని మంజూరు చేస్తారని చెప్పారు. అర్హత కలిగిన వారు సచివాలయాల్లోని కార్యదర్శుల వద్ద దరఖాస్తులు అందచేయాలన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. కాగా, 47,48 డివిజన్లలో ప్రజలు పలు సమస్యలతో సతమతమవుతున్నార ని టీడీపీ నాయకుడు ధర్మవరం సుబ్బారావు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. కంసాలి వీధిలో వర్షపు నీరు నిలుస్తోందని, కామాటి వీధి లో వాలిన విద్యుత్ స్తంభాలతో ప్ర మాదం పొంచి ఉందని తెలిపారు. పారిశుధ్య కార్మికులకు జీతాలు, భద్రతా పరికరాలు అందచేయాలని కోరారు.



పీజీఆర్ఎస్‌లో సమస్యలు వింటున్న కమిషనర్ నందన్

ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచొద్దు : బీజేపీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచాలన్న నిర్ణయాన్ని బీజేపీ వ్యతిరేకిస్తోందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఎత్తు పెంచితే శ్రీశైలం డ్యామ్ కృష్ణా జలాలను కోల్పోతుం దని, రాష్ట్ర శ్రేయస్సు కోసం స్పష్టమైన విధానాన్ని అనుసరించాలని తెలుగుగంగ ప్రాజెక్టు ఎస్ఈ రాధాకృష్ణ రెడ్డికి సోమవారం వినతి పత్రం అందించారు. నాయకుడు మి డతల రమేష్ మాట్లాడుతూ కర్ణాటక ప్రభు త్వం ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచాలని నిర్ణయిం చిందని, దీనిని తెలంగాణ ప్రభుత్వం వ్యతిరే కించిందని, కర్ణాటక ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొట్లూరు శ్రీనివాసులు, రాజేశ్వరమ్మ, నరాల సుబ్బారెడ్డి, సృజన పద్మ, రఘురామయ్య, పల్నాడు సూర్యనారాయణ, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



తెలుగుగంగ ఎస్ఈ రాధాకృష్ణారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ కార్యాలయంలో వైద్య శిబిరం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): సేవ పక్షోత్సవాల్లో భాగంగా నగరలోని చిన్నబజారు బీజేపీ కార్యాలయంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. హోమియోపతి వైద్యుడు మహేంద్ర బృందం రోగులను పరీక్షించి హోమియో మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు హేమంత్, నాయకులు రాధాకృష్ణ, పెంచలయ్య, బాలాజీ, చక్రి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత వైద్యపరీక్షలు

అల్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఉచితం గా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు ఆయన తెలిపారు.

లోడింగ్, అన్‌లోడింగ్ రాత్రి పూటే జరగాలి

- పగటిపూట భారీ వాహనాలకు నగరంలోకి ప్రవేశం లేదు
- ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని స్టోన్‌హౌస్‌పేట, పప్పులవీధిలో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతున్న సందర్భంగా భారీ వాహనాలు రాత్రి 10 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు మాత్రమే లోడింగ్, అన్‌లోడింగ్ చేసుకోవాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ సూచించారు. సోమవారం ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో స్టోన్‌హౌస్‌పేటకు చెందిన సింహపూరి వాణిజ్య మండలికి చెందిన లారీ అసోసియేషన్ వారితో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా రాత్రి పూటే లోడింగ్, అన్‌లోడింగ్ చేసుకోవాలన్నారు. మిగిలిన సమయాల్లో ఎలాంటి భారీ వాహనాలకు నగరంలోకి ప్రవేశం లేదని, దీనిని అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాడైపోతున్నా పట్టించుకోరే..?

- శిథిలావస్థలో డీఎస్ఏ జిమ్
- తుప్పుపట్టిన పరికరాలు
- సిబ్బంది అలక్ష్యంతో నిరుపయోగం

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్తులన్నా, భవనాలన్నా ఎవరికైనా అలుసే! లక్షలాది రూపాయలు వెచ్చిస్తారు....అన్నీ ఏర్పాటు చేస్తారు... నిరుపయోగంగా వదిలేస్తారు!. సంబంధిత అధికారులు కానీ, సిబ్బంది కానీ పట్టించుకోరు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో ప్రజల కోసం జిమ్‌ను కూడా లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన తొలి రోజుల్లో అంతా సవ్యంగానే జరిగినా, దీనిపై పర్యవేక్షణ లేకపోవడంతో నెమ్మదిగా జిమ్‌లోని కొన్ని వస్తువులు మాయం కాగా మిగిలినవన్నీ నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి. తొలుత ఈ జిమ్‌ను స్విమ్మింగ్‌లో చేరిన వారు మాత్రమే వినియోగించాలని నిబంధనలు పెట్టినా కొన్ని రోజులకే దానిని గాలికొదిలేశారు. దీనిపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ప్రతి ఒక్కరూ ఇష్టానుసారంగా జిమ్‌లోకి వెళ్లి కొంత సేపు వ్యాయామం చేయడం పరిపాటిగా మారింది. దీన్ని ఎవరూ కూడా అడ్డుకోకపోవడంతో అందులోని కొన్ని విలువైన సమాగ్రి మాయమైంది. అప్పుడు కళ్లు తెరిచిన సిబ్బంది కొంత కాలం ఈ జిమ్‌కు తాళాలు వేశారు. తిరిగి తెరిచినా అందులోని తుప్పుపట్టిపోయి ఉన్నాయి. ప్రస్తుతం స్విమ్మింగ్‌కు వచ్చే వారు కూడా ఈ జిమ్‌లో సామగ్రి సరిగా లేకపోవడంతో వ్యాయామానికి ఆసక్తి చూపడం లేదు. దీనిపై గతంలో పని చేసిన కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో వారు కొంతకాలం దీనిని కట్టడి చేయడంతో పాటు కొత్తగా జిమ్ సామగ్రిని కూడా అప్పగించారు. అయితే వీటిని కూడా సద్వినియోగం చేసుకోలేకపోవడం, సిబ్బంది అలసత్వం కారణంగా తిరిగి జిమ్ శిథిలావస్థకు, అపరిశుభ్రంగా తయారైంది. దీనికి తోడు బయటి వ్యక్తులు రావడంతో ఇక్కడ క్రీడాకారులకు రక్షణ కరువైంది.

ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి లక్షలాది రూపాయాలు వెచ్చించి ఏర్పాటు చేసిన జిమ్‌ను పునరుద్ధరించాలని, అవసరమైన పరికరాలను అందుబాటులో ఉంచాలని స్విమ్మర్స్, వాకర్స్ కోరుతున్నారు.



రేపు పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు : ఎంహెచ్‌వో

నెల్లూరు(సిటీ),సెప్టెంబరు 22,(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు కార్పొరేషన్ ఆరోగ్య విభాగంలో పని చేస్తు న్న పారిశుధ్య కార్మికులకు బుధవారం వైద్య పరీక్ష లు నిర్వహించను న్నట్లు ఎంహెచ్‌వో కనకాద్రి తెలిపారు. సోమవారం ఎన్ఎంసీలోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 17న మొదలై అక్టోబరు 2వ తేదీతో ముగియ నున్న స్వచ్ఛతహీ సేవ కార్యక్రమాల్లో భాగంగా ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంతోపాటు, ఎన్‌టీఆర్‌కాలనీ, టైలర్స్‌కాలనీ, కోటమిట్ట, చాకలివీధి, జాఫర్‌సాహెబ్ కాలువగట్టు, జేవీఆర్ కాలనీ, వేదాయపాళెం, రైతు బజార్, ప్రగతినగర్, వెంగమాంబవీధి, పోలేరమ్మచెట్టు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు జరుగుతాయని పేర్కొన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వారి పరిధిలోని కార్మికులకు వైద్యశిబిరాల్లో పరీక్షలు చేయించాలని సూచించారు.



రామలింగాపురం అండర్ బ్రిడ్జి
త్వరలో పునఃప్రారంభం

- శరవేగంగా సుందరీకరణ పనులు

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రామలింగాపురం అండర్ బ్రిడ్జి వద్ద సీసీ రోడ్లు, సుందరీకరణ పనులు శరవేగంగా జరు గుతున్నాయని త్వరలోనే రాకపోకలను పునః ప్రారంభించనున్నట్లు టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఎన్ఎంసీ ఇంజ నీరింగ్ అధికారులతో కలిసి ఆయన ఆ ప్రాంతంలో పనులను పరిశీలించారు. సీసీరోడ్డు నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయని, సుందరీకరణ పనులు కూడా త్వరలోనే పూర్తవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మదన్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న గిరిధర్‌రెడ్డి

బహిరంగ ప్రకటన

SCHEDULE

Perepi Venugopal, B.Com., B.L., Advocate, Tekkemitta, Nellore. Cell: 8374259528

బహిరంగ ప్రకటన

SCHEDULE

Perepi Venugopal, B.Com., B.L., Advocate, Tekkemitta, Nellore. Cell: 8374259528

జనరల్ నోటీసు

M.Mushtaq Ahmed, M.B.A., B.L., Advocate, D.No.23-1-957, Mulapet, Nellore-524003. Cell: 9441443110

చి(చె)త్తశుద్ధి ఇదేనా!?



నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయ భవనంలో మూటలు కట్టిపడేసిన పాతవస్తువులు



కు.ని నియంత్రణ శిక్షణ కేంద్రం వద్ద..



కలెక్టరేట్ వెనుక అడవిలా పెరిగిన పిచ్చి మొక్కలు

నెల్లూరు నగరంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం విజయవంతం అయిందని గత శనివారం అధికారులు ప్రకటించారు. అయితే నగరంలోని కొన్ని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మాత్రం చెత్తకుప్పలు, పిచ్చిమొక్కలు అలాగే ఉండి, అధికారుల చి(చె)త్తశుద్ధిని ప్రశ్నిస్తున్నాయి. ప్రధానంగా కలెక్టరేట్ వెనుకభాగంలో పిచ్చిమొక్కలు పెరిగిపోయి అడవిని తలపిస్తున్నాయి. అలాగే రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద చెత్త పేరుకుపోయి, మురుగునీటి నిల్వతో కంపు కొడుతూ, ప్రజా ఆరోగ్యానికి హానికరంగా తయారయ్యాయని ప్రజలు ఆందోళన వక్తం చేస్తున్నారు. ఇకపోతే జీజీహెచ్ ప్రసూతి ఆసుపత్రి ఆవరణలో కూడా చెత్తాచెదారం, పాత పరుపులు పోగిపడి, స్వచ్ఛాంధ్రను వెక్కిరిస్తున్నాయి. ఇప్పటికైనా వీటిని తొలగించేలా అధికారులు చర్యలు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్ (నెల్లూరు, ఆంధ్రజ్యోతి)



రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట మురుగునీరు



జీజీహెచ్‌లోని ప్రసూతి ఆవరణలో చెత్తాచెదారం

ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన

కలిగిరి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పొగాకు సాగుచేస్తున్న రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై మొగ్గుచూపాలని వేలం నిర్వహణాధికారి శివకుమార్ సూచించారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొగాకు ధరలు అంతర్జాతీయ మార్కెట్‌పై ఆధారపడి ఉంటాయని, ధరల్లో హెచ్చుతగ్గులు సహజమన్నారు. పొగాకు సాగుచేస్తున్న రైతులు కొంతమేర అయినా ప్రత్యామ్నాయ పంటలు సాగుచేస్తే ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి అవకాశముంటుందన్నారు. బోర్డు అనుమతించిన మేరకు మాత్రమే పొగాకు సాగుచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్‌కుమార్, బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కార్మిక చట్ట సవరణ బిల్లును రద్దు చేయాలి

● 8 గంటల పని విధానాన్నే అమలు చేయాలి

● సీఐటీయూ డిమాండ్



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దేశంలో కార్మిక చట్ట సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, నాగేశ్వర రావు డిమాండ్ చేశారు. సీఐటీయూ నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద నిరసన ప్ర దర్శన జరిగింది. వారు మాట్లాడుతూ కార్మిక చట్ట సవరణ బి ల్లు వల్ల యాజమాన్యాలు కార్మికులను బానిసలుగా చూసే అ వకాశం ఉందన్నారు. బ్రిటీష్ వలస పాలకులను ఎదిరించి సా ధించుకున్న 8 గంటల పని విధానాన్ని 10 గంటలు చేయటం ప్రభుత్వానికి తగదని హితవు పలికారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వర్గంపై దాడి పెరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా దీని అమలుకు పూనుకోవటం కార్మికులకు ద్రోహం చేయటమేనన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో కార్మికుల బిల్లు సవరణకు తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కత్తి శ్రీనివాసులు, ఆర్ శ్రీనివాసులు, బాబూ రావు, ఆశోక్, కామాక్షమ్మ, మూలం ప్రసాద్, మధు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం!

● ఆర్‌అండ్‌బీ అధికారుల తీరుపై విమర్శలు

● ఉదయగిరి-నందవరం, సంగం-కలువాయి రోడ్డు టెండర్లు రద్దు

● సింగిల్ టెండర్ పేరుతో క్యాన్సిల్.. మళ్లీ సెకండ్ కాల్

● నెల రోజుల క్రితం ఇదే సింగిల్ టెండర్లు ఆమోదం

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న విధంగా తయారైంది ఆర్‌అండ్‌బీ శాఖలో పరిస్థితి. దెబ్బతిన్న రోడ్లను బాగు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా వాటిని సద్వినియోగం చేసుకోవడంలో అధికారులు నాన్చుడు ధోరణి ప్రదర్శిస్తున్నారు. కొన్ని రోడ్ల విషయంలో ఒకలా, మరికొన్ని రోడ్ల విషయాల్లో మరోలా నిబంధనలు మారుస్తూ వివాదాలకు తెరలేపుతున్నారు. తద్వారా రోడ్లను బాగు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ఫలితం లేకుండా పోతోంది.



గుంతలమయంగా ఉన్న నందవరం-ఉదయగిరి రోడ్డు

నెల్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నందవరం-ఉదయగిరి, సంగం-కలువాయి రోడ్లు కొన్ని చోట్ల దారుణంగా దెబ్బతిని ఉన్నాయి. ఈ రోడ్లను బాగు చేయాలని ఐదేళ్ల నుంచి ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అనేక జిల్లా పరిషత్ సమావేశాల్లోనూ ఈ రోడ్ల దుస్థితిని ప్రజాప్రతినిధులు ప్రస్తావించారు. ఈ గుంతల్లో పడి పలు ప్రమాదాలు కూడా జరిగాయి. ఈ రెండు రోడ్లు కీలకమైన కనెక్టివిటీ రహదార్లు. ఈ రోడ్లతో పాటు మరి కొన్ని రోడ్లను బాగు చేయాలని జిల్లా నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. వాటిని పరిశీలించిన ప్రభుత్వం జిల్లాకు సుమారు రూ.30 కోట్ల నిధులు మంజూరు చేసింది. కొన్ని ఎండీఆర్ వర్కులు కాగా మరికొన్ని స్టేట్ హైవేస్ ఉన్నాయి. ఎండీఆర్ వర్కులకు జూలై నెలలో టెండర్లు పూర్తి చేశారు. ఆ సమయంలో రోడ్ల దుస్థితి దృష్టిలో పెట్టుకొని అధికారులు సింగిల్ టెండర్ వచ్చినా కూడా ఆమోదించారు. అయితే ఇటీవల పిలిచిన స్టేట్ హైవేస్ విషయంలో మాత్రం సింగిల్ టెండర్లను ఆమోదించలేదు. నందవరం-ఉదయగిరి, సంగం-కలువాయి రోడ్లకు ఒక్కొక్క కాంట్రాక్టర్ మాత్రమే టెండర్ వేశారు. దీంతో ఈ రెండు టెండర్లను రద్దు చేసిన ఆర్అండ్‌బీ అధికారులు ఇప్పుడు రెండో కాల్ పిలిచారు. అయినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతే ఆ రెండు రోడ్లను ఎలా బాగు చేస్తారంటే మాత్రం ఆర్అండ్‌బీ అధికారుల నుంచి సమాధానం లేదు. అసలే చేసిన పనులకు బిల్లులు రాక కాంట్రాక్టర్లు కొత్తగా పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. గత ప్రభుత్వంలో అసలు ఒక్కరు కూడా టెండర్లు వేయకపోవడంతో రద్దయిన వర్కులు అనేకం ఉన్నాయి. అటువంటి పరిస్థితుల్లో రోడ్లను వీలైనంత వేగంగా బాగు చేయాలన్న ఆలోచన దిశగా ఆర్ అండ్‌బీ అధికారులు అడుగులు వేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా దీనిపై వివరణకై ఆర్అండ్‌బీ ఎస్ఈ గంగాధర్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

● కలెక్టర్ హిమాన్షు శుక్లా ● పీజీఆర్ఎస్‌కు 524 అర్జీలు



తిక్కన భవన్ బయట ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో అలసత్వం వహించరాదని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయన సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కు హాజరయ్యారు. అర్జీల రూపంలో సమస్యలు స్వాగతం పలికాయి. కలెక్టర్‌కు 524 మంది అర్జీలు సమర్పించారు. వాటిలో 180 రెవన్యూశాఖకు సంబంధించి ఉన్నాయన్నారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించా రు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయకుమార్, జడ్పీ సీఈవో మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● ఏర్పాట్ల పరిశీలన

అర్జీలు స్వీకరించే ముందు కలెక్టరేట్ తిక్కన ప్రాంగణం వెలుపల అర్జీదారులకు అందుతున్న సేవలను కలెక్టర్ శుక్లా పరిశీలిం చారు. షామియానాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అర్జీదా రులకు అర్జీలు ఉచితంగా రాసిపెట్టాలని ఆదేశించారు.

● తమను పాఠశాలల నుంచి రిలీవ్ చేయాలని కోరుతూ పలు వురు ఉపాధ్యాయులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. తాము ఈ ఏడాది జూన్ 16న బదిలీ అయ్యామని, తాము పనిచేస్తున్న పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకపోవటం వల్ల అక్కడే కొనసాగుతున్నామని చెప్పారు. తక్షణం రిలీవ్ చేయాలని కోరారు.

● ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి : పీడీఎస్‌యూ

నెల్లూరు(విద్య) : ప్రభుత్వ నిబంధనల ప్రకారం దసరా సెలవులు ఇవ్వకుండా తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చ ర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎస్‌కే షారూఖ్ కోరారు. ఈ మేరకు పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు వినతి పత్రం ఇ చ్చారు. అన్నీ పాఠశాలలకు దసరా సెలవులు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు మాత్రం తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తు న్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆశిర్, అన్వర్‌మస్తాన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం సీట్లివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నాయకులు

నెల్లూరు (వైద్యం), (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రా ష్ట్ర ఇన్‌చార్జి నూకాలమ్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరపు లలితారాం డిమాండ్ చేశారు. సోమవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ కమిటీ సమావేశం నగరం లో జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన విలేరరుల సమావేశంలో లలితారాం మాట్లాడారు. 9 నెలలుగా జిల్లాలో తమ సంఘం అనేక కార్యక్రమాలు చేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో బీసీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. ఇటీవల ఎన్నికైన సంఘం జిల్లా కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం దక్షిణ రాష్ట్రాల ఇన్‌చార్జి షణ్ముగం, రాష్ట్ర కార్యదర్శి రాజు, రాష్ట్ర నాయకుడు ఆదిశేషు, జిల్లా అధ్యక్షుడు సమాధి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రెండు లారీల్లోనే బియ్యం

● నిర్ధారించిన పౌరసరఫరాల శాఖ

● నేడు స్వాధీనం చేసుకోనున్న అధికారులు

● రాజకీయంగా దుమారం రేగే అవకాశం



సివిల్ సప్లయ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న బియ్యం లారీలు

నెల్లూరురూరల్,సెప్టెంబరు 22,(ఆంధ్రజ్యోతి) : బియ్యం లారీల గుట్టు రట్టైంది. పౌరసరఫరాల శాఖ అధికారులకు ఆదివారం పట్టుబడిన ఐదు లారీల్లో రెండు లారీల్లోనే రేషన్ బియ్యం ఉన్నట్లు ఆ శాఖ తేల్చింది. ఆది, సోమవారాల్లో సేకరించిన బియ్యం నమూనాలను పరీక్షలకు పంపగా, వాటి ఫలితాలు సోమవారం రాత్రి వెలువడ్డాయి. ఐదు లారీల్లోని రెండు లారీల్లో రేషన్ బియ్యం ఉన్నట్లు అందిన ఫలితాల ద్వారా వెల్లడైందని పౌరసరఫరాల శాఖలోని ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఆ లారీలను మంగళవారం గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని 6ఏతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేస్తామని ఆయన తెలిపారు. మిగిలిన మూడు లారీల్లోని బియ్యం ఆధారాలను పరిశీలించి విడుదల చేస్తామని వివరించారు. ఐదు లారీల్లో 150 టన్నుల వరకు బియ్యం లోడై ఉన్నట్లు గుర్తించిన అధికారులు, తాజాగా తేల్చిన లెక్కల ప్రకారం రెండు లారీల్లో 60 టన్నుల వరకు రేషన్ బియ్యం ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ లెక్కన వాటి విలువ టన్నుల రూ. 46 వేల చొప్పున 60 టన్నులు రూ. 27.60 లక్షల వరకు ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేశారు. మంగళవారం రంగంలోకి దిగే పౌరసరఫరాల శాఖ వీటి పూర్తి వివరాలను బహిర్గతం చేయనున్నది. ఈ విషయం రాజకీయంగా దుమారం రేగనున్నట్లు పరిశీలకులు భావిస్తున్నారు.



పరీక్షలకు సేకరించిన బియ్యం నమూనాలు

రుణం పేరుతో రూ.2.9 లక్షల మోసం

● ఆర్డీవోకి బాధిత మహిళ ఫిర్యాదు

కావలి,సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): నమ్మకంగా తన ఇంటిలో రెండేళ్లు పాచిపని చేయించుకుని, ఆయన్ను నమ్ముకోవటంతో తమకు సాయం చేయటం మరిచి రుణం పేరుతో రూ.2.9లక్షలు మోసం చేసాడని కావలిరూరల్ మండలం సిరిపురం గ్రామానికి చెందిన జంగిలి ప్రిస్కిల్లా ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఈ మేరకు ఆమె ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణకు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసింది. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. తన తల్లి జలదంకి ఎలీషమ్మ కావలి కొత్త బజారులో ఉన్న దుగ్గి రమేష్ ఇంటిలో పాచిపని చేస్తూ ఎంతో న మ్మకంగా ఉండేదన్నారు. దీంతో ఆయన బ్యాంకు నుంచి ముద్రా రుణం రూ.2లక్షలు ఇప్పించి ఆయనే వాడుకున్నాడని పేర్కొంది. రెండు వాయిదాలు బ్యాంకుకు ఆయనే డబ్బులు కట్టాడని, ఎస్సీ కార్పొరేషన్ నుంచి రు.5లక్షలు రుణం ఇప్పిస్తాన ని, అందుకు రూ.90 వేలు ఖర్చు అవుతోందని తీసుకున్నాడని తెలిపారు. ఆ రు ణం ఇప్పించకుండానే ముద్రా రుణం వాయిదాలు చెల్లించకుండానే ఆయన కా వలి వదిలి నెల్లూరుకు కాపురం మార్చారని చెప్పారు. దీంతో బ్యాంకు వారు ము ద్రా రుణం వాయిదాలు కట్టమని తమ వద్దకు వస్తుండటంతో వాటిని కడుతున్నామన్నారు. ముద్రా రుణం వాయిదాల విషయం, ఎస్సీ కార్పొరేషన్ రుణం కోసం ఇచ్చిన రూ.90 వేల విషయం ఆయన్ను అడగ్గా, ఫోన్‌లో బూతులు తిట్టారని బాధితురాలు పేర్కొన్నారు. ఆ తర్వాత కొంత కాలానికి అసలు మా ఫోన్‌లు ఎత్తడం మానేశాడని వాపోయారు. దీంతో తాము పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన లేక పోవటంతో ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చామని పేర్కొన్నారు.

తమిళ బోట్లను అడ్డుకోవడమే లక్ష్యం

● ఆంధ్ర మత్స్యకారులకు చిక్కిన మరో బోటు

● తాడో పేడో తేల్చుకుందాం అంటున్న తీరప్రాంత మత్స్యకారులు



ఫిషింగ్ హార్బర్‌లో ఉన్న చెన్నై మెటనైజ్డ్ బోట్లు

బిట్రగుంట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కడలూరు, కారైకల్ మెటనైజ్డ్ బోట్ల దూకుడును ఆంధ్ర మత్స్యకారులు అడ్డుకునేందుకు సన్నద్ధమయ్యారు. ఇటీవల 160 తీర ప్రాంత మత్స్యకారులు ఏకమై తమిళ మత్స్యకారుల ఆగడాలకు చెక్ పెట్టేందుకు తీర్మానం చేశారు. అయితే, కొంతమంది పెద్దలు వీరిని శాంతి పరిచేందుకు ప్రయత్నించినా ససేమీరా అన్నారు. ఈ నెల 19వ తేదీన తిరుపతి జిల్లా వాకాడు తీరప్రాంతంలో చేపల వేటకు వచ్చిన తమిళనాడు బోటును స్థానిక మత్స్యకారులు గుర్తించారు. పథకం ప్రకారం జువ్వలదిన్నె మత్స్యకారుల ఆధీనంలో ఉన్న కడలూరు బోటులో వెళ్లి ఆ బోటును అడ్డుకున్నారు. అనంతరం అక్కడ నుంచి జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు తరలించారు. అల్పపీడన ప్రభావంతో సముద్రం ఉండే కసురుకన్నా మరింత ఎక్కువగా గంగపుత్రులు అక్రమ దారులపై కసిగా ఉన్నారు. దీంతో అటు మెరైన్ ఇటుపోలీసులు ఏమి చేయలేని పరిస్థితి నెలకొని ఉంది. ఇక నుంచి కడలూరు, కారైకల్ ప్రాంతాలకు చెందిన మత్స్యకారుల ఆట కట్టించడానికి ఇదే సరైన మార్గమని గంగపుత్రులు ఎంచుకున్నారని పెద్దలు అంటున్నారు.

జీఎస్టీ పన్ను తగ్గింపు పట్ల హర్షం.. నేతలకు పాలభిషేకం

కందుకూరు, (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా జీఎస్టీ పన్నులు తగ్గించడం పట్ల కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని రియలన్స్ మాల్ వద్ద ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, కేంద్ర ఆర్థికశాఖా మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. జీఎస్టీ భారం తగ్గడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఊరట కలుగుతోందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఘట్టమనేని హరిబాబు, జొన్నాదుల రాఘవయ్య, మన్నేపల్లి వరప్రసాదరావు, దామా మల్లేశ్వరరావు, తిరుపాలు, వంశీ పాల్గొన్నారు.

విచారణ జరిపి న్యాయం చేస్తాం

● ఎస్పీ డాక్టర్ అజిత



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అర్జీదారుల ఫిర్యాదులపై చట్ట ప్రకారం విచారణ జరిపి న్యాయం చేస్తామని ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల తెలిపారు. సోమవారం నెల్లూరులోని ఉమేషచంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఎస్పీ పాల్గొని బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు జవాబుదారిగా వ్యవహరిస్తూ అర్జీలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా, ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమానికి 122 ఫిర్యాదులు అందాయి.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కి వినతి

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారానికి విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. పెద్దఎత్తున నినాదాలతో ప్రభుత్వంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. జేఏసీ చైర్మన్ కే శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను దీర్ఘకాలంగా పరిష్కరించలేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం తక్షణమే చొరవ తీసుకుని సమస్యలను పరిష్కరించాలన్నారు.లేకుంటే భవిష్యత్తులో మరింత పోరాటం తప్పదన్నారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు దామోదర్, అల్తాఫ్, శ్రీనివాసులు, నజీర్‌ఖాన్, వెంకటేశ్వర్లు, రఫీ, నవాబ్ జాన్, కాంట్రాక్ట్ యూనియన్ నేతలు హజరత్ వలి, కృష్ణ, నవీన్, రమణారెడ్డి, నాంచారయ్య, ప్రసాద్, ఫిరోజ్, సంతోష్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ముగిసిన నామినేషన్ల గడువు

● మూడు డైరెక్టర్ పదవులకు ఐదు నామినేషన్లు

● నేటితో ఉపసంహరణ గడువు పూర్తి



నామినేషన్ దాఖలు చేస్తున్న సాయినిరోషా

నెల్లూరు(వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పాల ఉత్పత్తుల పరస్పర సహాయ సహకార సమితి (విజయ డెయిరీ)లో బోర్డు డైరెక్టర్ల ఎన్నికలకు సోమవారం ఐదుగురు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎ న్నికల అధికారి హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీ అయిన మూడు స్థానాలకు గూడూరు మండల సంతదాసుపల్లి పాల సొసైటీ అధ్యక్షుడు ఇనుకుర్తి మల్లికార్జున నాయుడు, ఇందుకూరుపేట మండలం మైపాడు సొసైటీ అధ్యక్షుడు కాకుటూరు చంద్రశేఖర్‌రెడ్డి, కొడవలూరు మండలం రేగడిచలిక పాల సొసైటీ అధ్యక్షురాలు గుర్రం నాగేశ్వరమ్మ, అల్లూరు మండలం బీరంగుంట సొసైటీ అధ్యక్షుడు పొంకం హరిబాబు, బాలాయపల్లి మండలం వెంగమాంబాపురం సొసైటీ అధ్యక్షురాలు సూదలగుంట సాయినిరోషా తమ నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్‌ల పరిశీలన అనంతరం ఈ ఐదుగురి నామినేషన్లను అనుమతిస్తున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటల వరకు నామినేషన్‌ల ఉపసంహరణ గడువు ఉందని తెలిపారు. ఆ తరువాత కూడా ముగ్గురు కంటే ఎక్కువమంది బరిలో ఉంటే ఈనెల 27 ఎన్నికలను నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

WANTED

ఫోర్స్ మోటార్స్ కంపెనీ షోరూం నందు పనిచేయుటకు సేల్స్ ఎక్జిక్యూటివ్స్ & రిసెప్షనిస్ట్ కావలెను. అమృత మోటార్స్, బుజబుజ నెల్లూరు. సెల్: 9581 299916, 94929 34103

AJR-11378

హెల్పర్స్ కావలెను

రేమండ్ షోరూం, నర్తకి సెంటర్, నెల్లూరు నందు పని చేయుటకు సేల్స్‌మెన్, హెల్పర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతము ఇవ్వబడును. 30 సం.ల లోపు వారు. సం.ప్ర. సెల్: 93901 62762

AJR-217

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

విద్యార్థులకు రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు

ఉదయగిరి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది కళాశాలలోని విద్యార్థినీ, విద్యార్థులకు రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్ నారాయణస్వామి, వైస్ ప్రిన్సిపాల్ ఆకుల నరసింహులు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కేసీ విక్రమ్, వైద్య సిబ్బంది అధ్యాపకులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10722
వెండి కిలో ధర	రూ. 138200
వెండి ఒక గ్రాము	రూ. 141.20



రూ. 54 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు లక్ష్యం

● ఎన్. రవిశంకర్‌రెడ్డి, ఏపీఎం

సంగం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికి మండలంలో 731 పొదుపు సంఘాలకు (ఎస్‌హెచ్‌జీ) రూ. 54 కోట్ల మేర బ్యాంక్ లింకేజీ రుణాలు లక్ష్యంగా నిర్దేశించినట్లు డీఆర్‌డీఏ (వెలుగు) ఏపీఎం రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు.

? ఇప్పటి వరకు ఎన్ని ఎస్‌హెచ్‌జీలకు ఎన్ని కోట్ల బ్యాంక్ లింకేజీ ఇప్పించారు.

! మండలంలో 73 పొదుపు సంఘాలకు రూ. 9.59 కోట్ల బ్యాంక్ లింకేజి కింద రుణాలు మంజూరు చేయడం జరిగింది.

? స్త్రీనిధి పథకంలో రుణ లక్ష్యం ఎంత, సభ్యులు ఎంతమంది. ఇప్పటివరకు ఎంతమందికి రుణాలు ఇచ్చారు.

! ఈ పథకంలో 892 మందికి రూ. 8.92 కోట్ల మేర రుణ లక్ష్యం నిర్దేశించారు. ఇప్పటి వరకు 153 మందికి రూ. 1.08 కోట్ల మేర రుణం అందచేశాం.

? ఈ పథకంలో ఒక్కొక్క సభ్యురాలికి ఎంత రుణం ఇస్తారు. మొత్తం సంఘానికి రుణ మెంత.

! ఒక్కొక్కరికి రూ. 50 వేల చొప్పున సంఘం మొత్తానికి రూ. 5 లక్షలు మంజూరు చేస్తాం.

? మండలంలో మొత్తం ఎన్ని పొదుపు సంఘాలు ఉన్నాయి. సభ్యులు ఎంత మంది ఉన్నారు.

! మండలంలోని 20 పంచాయతీలు, 30 హ్యాబిటేషన్లల్లో 938 పొదుపు సంఘాలున్నాయి. 9,405 మంది సభ్యులు ఉన్నారు.

న్యూస్ బాక్స్

వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలి



వాహనదారులకు రహదారి నిబంధనలు వివరిస్తున్న సీఐ వేమారెడ్డి

సంగం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రహదారి నిబంధనలు పాటించాలని సీఐ వేమారెడ్డి సూచించారు. సోమవారం స్థానిక చెక్‌పోస్టు సెంటర్‌లో ముంబాయి జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనదారులకు రహదారి భద్రత సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణం చేసే వారు సీట్‌బెల్టు ధరించాలని సూచించారు. ముంబాయి జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

బోర్డు అనుమతి మేరకే పొగాకు సాగుచేయాలి

మర్రిపాడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బోర్డు అనుమతి మేరకే పొగాకు సాగు చేయాలని వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు. డీసీపల్లి బోర్డులో పొగాకు నియంత్రణ ఆవశ్యకతను గురించి సోమవారం రైతులతో వేలం నిర్వహణాధికారి సమావేశం ఏర్పాటు చేశారు. 2025-26 పంటకాలానికి ప్రతీ బ్యారన్‌కు 2.90 హెక్టార్లు (7.25 ఎకరాలు), 3665 కిలోలు పండించటానికి అనుమతి ఇస్తున్నట్లు తెలిపారు. గడిచిన మూడు సంవత్సరాలుగా రైతులకు ఆశాజనకంగా ధరలు లభించగా, అదే పరిస్థితి నిత్యం ఉంటుందని భావించి అనుమతికి మించి సాగుచేస్తే రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఐటీసీ మేనేజరు హుమాయూన్, ఫీల్డ్ ఆఫీసరు జగన్నాథన్ పాల్గొన్నారు.

సీతారామపురంలో వైద్య శిబిరం

సీతారామపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత పేదలకు ఉచిత వైద్యం అందించడమే లక్ష్యమని మారంరెడ్డిపల్లి సొసైటీ అధ్యక్షుడు సోమన బోయిన రాజశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణలో నారాయణ ఆరోగ్యమస్తు పథకం కింద మెగా ఉచిత వైద్య శిబిరాన్ని సొసైటీ అధ్యక్షుడు సోమన బోయిన రాజ శేఖర్ టీడీపీ మండల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా సాధారణ, చర్మ, కీళ్ళు, ఎముకలు, కంటి, చిన్నపిల్లల వ్యాధులకు సంబంధించి వైద్య నిపుణులచే పరీక్షలు నిర్వహించారు. అలాగే బీపీ, షుగర్ పరీక్షలు చేశారు.

అంగరంగ వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభం



సంగం : పెన్నా కలశ జలాలతో ఆలయానికి వస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకారంలో పాలేటి గంగమ్మతల్లి



ఉదయగిరి: బాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో పార్వతీదేవి

సంగం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఆలయాల్లో సోమవారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా స్థానిక పెన్నానది ఒడ్డున ఉన్న కామాక్షిదేవి సమేత సంగమేశ్వరాలయం, గంగమ్మ ఆలయాల్లో వేద పండితులు మంగళ వాయిద్యాల నడుమ కలశ స్థాపన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం రాత్రి కామాక్షి దేవి బాలాత్రిపురసుందరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా ఆలయంలో స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించారు. ఇరిగేషన్ ఏఈ వినయ్‌కుమార్ స్వామి, అమ్మవార్లకు నూతన పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీరించారు. అలాగే స్థానిక పాలేటి గంగమ్మ ఆలయంలో సోమవారం రాత్రి గంగమ్మతల్లి మూలవిరాట్‌ను పసుపు, కుంకుమతో అలంకరించారు. అనంతరం పూలంగిసేవ నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

● ఉదయగిరి: ఉదయగిరి పట్టణంలో శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పార్వతీపరమేశ్వర, బాలాజీనగర్, సంతానలక్ష్మీ ఆలయాల్లో అమ్మవారు భక్తులకు బాలత్రిపురసుందరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

● దుత్తలూరు: మండలంలోని నర్రవాడ పంచాయతీ గుడేవారిపాళెం గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రేణుకాఎల్లమతల్లి బాలత్రిపురసుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

● వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని తూర్పురొంపిదొడ్ల గ్రామంలో ఉన్న మానసాదేవి శైలపుత్రి, వరికుంటపాడులో నాగారప్పమ్మ బాలత్రిపురసుందరీదేవి అలంకరణల్లో సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆయా ఆలయాలకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

● వింజమూరు: పట్టణంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో ఏర్పాటుచేసిన అన్నపూర్ణదేవి నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభించారు. హోమగుండాన్ని ఏర్పాటుచేసి ఆలయ ధర్మకర్తలు, ఆలయ కమిటీ పెద్దలు పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మాలకొండారెడ్డి మాట్లాడుతూ అక్టోబరు 2న నవరాత్రి ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు వసంతరావు, వినయ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



వరికుంటపాడులో శైలపుత్రి అలంకరణలో మానసాదేవి



బాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో నాగారప్పమ్మ దేవి



వింజమూరు అయ్యప్పస్వామి దేవస్థానంలో ప్రత్యేక అలంకారంలో అన్నపూర్ణదేవి

స్వయం సహాయక సంఘాలకు శిక్షణ



స్వయం సహాయక సంఘాలకు శిక్షణ ఇస్తున్న అధికారులు

సీతారామపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రాష్ట్ర ప్రభుత్వం మన డబ్బులు - మన లెక్కలు అనే ప్రత్యేక యాప్‌ను తీసుకువచ్చిందని ఏపీఎం శ్రీనివాసులు తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో సోమవారం ఆ యాప్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా మహిళలకు చేయూతనందించేందుకు ప్రభుత్వం డ్వాక్రా సంఘాలకు స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలు అందిస్తోందన్నారు. మహిళా సాధికారత కోసం బ్యాంకు లింకేజీ రుణాలు అందించి మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. ఈ యాప్ ద్వారా సభ్యులు తమ పొదుపు, తీసుకున్న అప్పులు, చెల్లించిన అప్పుల వివరాలను తెలుసుకోవచ్చన్నారు. ఇది సంఘ బలోపేతానికి దోహదపడుతుందని ఆయన తెలిపారు.

రైతులకు యూరియా పంపిణీ



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న సొసైటీ చైర్మన్ రాజశేఖర్

సీతారామపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులందరికీ తగినంత యూరియా అందుబాటులో ఉందని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మారంరెడ్డిపల్లి సొసైటీ అధ్యక్షుడు సోమనబోయిన రాజశేఖర్ అన్నారు. మండల పరిధిలోని అయ్యవారిపల్లి రైతుసేవా కేంద్రంలో సోమవారం సొసైటీ చైర్మన్ సోమనబోయిన రాజశేఖర్, డైరెక్టర్లు రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు యూరియా కోసం ఆందోళన చెందవద్దని, కావలసినంత యూరియా అందుబాటులో ఉందని సూచించారు. యూరియాను అధిక మోతాదులో వాడటం పంటకు మంచిది కాదని, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మాత్రమే వాడాలని తెలిపారు. ఈకార్యక్రమంలో టీడీపీ మాజీ కన్వీనర్ ముత్తంశెట్టి చెన్నకేశవులు, సర్పంచ్ వెంకటసుబ్బయ్య, రమణయ్య, తోట ఏడుకొండలు, సొసైటీ డైరెక్టర్లు రఘు, భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై ఎల్ఐసీ ఉద్యోగుల హర్షం



ఎల్ఐసీ కార్యాలయంలో కేక్‌కట్ చేసిహర్షం చేస్తున్న ఉద్యోగులు

ఆత్మకూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ బీమా ప్రీమియంలో జీఎస్టీ తగ్గింపుపై ఆసంస్థ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు స్థానిక ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకత్వం ఆదేశాల మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బ్రాంచ్ మేనేజర్ సీహెచ్ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ మేక్‌ఇన్ ఇండి యా మేడ్ ఇన్ ఇండియాను ప్రజలకు అలవాటు చేయడానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ జీఎస్‌టీ తగ్గింపు చేయడం హర్షణీయ మన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి బ్రాంచ్ కార్యదర్శి శ్యాం ప్రభాకర్, ఎల్ఐసి బ్రాంచ్ ప్రెసిడెంట్ టి రమేష్, లియపీ ఆత్మకూరు బ్రాంచ్ ప్రెసిడెంట్ పడచల శ్రీనివాసులు యాదవ్, బ్రాంచ్ సెక్రటరీ ఎం శ్రీనివాసులు రెడ్డి, లియోపి ట్రెజరర్ ఓబుల్‌రెడ్డి, మాల్యాద్రి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణ యత్నం

● అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

మర్రిపాడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తుండటంతో ప్రభుత్వ భూములను దున్నేందుకు మండలంలో అక్రమార్కులు బరితెగించారు. సోమవారం అల్లంపాడు రెవెన్యూలో 1083, 1081 సర్వే నెంబర్లలోని సుమారు 20 ఎకరాల భూమిని ఆక్రమించేందుకు కొందరు జేసీబీ సహాయంతో కంపచెట్లను తొలగించారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు ఆర్ఐ సాయికిరణ్, సర్వేయర్ సుదర్శన్ అక్కడికి వెళ్లి అడ్డుకున్నారు. ఆక్రమణకు యత్నిస్తున్న వారిని హెచ్చరించి జేసీబీని అక్కడ నుండి పంపించేశారు.

దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దు



తరగతులు నిర్వహిస్తున్న పాఠశాల హెచ్ఎంతో మాట్లాడుతున్న మహంత్‌రెడ్డి

ఆత్మకూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో దసరా సెలవుల్లో తరగతులను నిర్వహిస్తుండడంతో ఆంధ్రవిద్యార్థి సంఘం నాయకులు సోమవారం పాఠశాలలకు వెళ్లి తరగతులను అడ్డుకున్నారు. సోమవారం నుంచి 2వ తేదీవరకు దరసరా సెలవులు. అయితే ఆత్మకూరు పట్టణంలో పలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు తరగతులు నిర్వ హిస్తుండడంతో ఆంధ్ర విద్యార్థి సం ఘం జిల్లా అధ్యక్షుడు మహంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తరగతు లను అడ్డుకుని ఆందోళన చేశారు. సెలవుల్లో తరగతులను నిర్వహిస్తే జిల్లావ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆంధ్ర విద్యార్థి సంఘం నాయకులు వినయ్, పూర్ణేష్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పథకంలో సంస్కరణలు తెచ్చినా ఫలితం శూన్యం

అడవిలా లేఅవుట్లు



అడవిని తలపిస్తున్న సోమశిల లేఅవుట్



సాగరంలో అసంపూర్తిగా నిర్మాణాలు

అనంతసాగరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పేదలకు గూడు కల్పించాలన్న ఉద్దేశ్యంతో గృహ నిర్మాణ పథకంలో సంస్కరణలు తెచ్చినా ఆశించిన ఫలితం దక్కడం లేదు. మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో లేఅవుట్లు వేసి ఇళ్లులేనివారికి గతంలో స్థలాలు మంజూరు చేశారు. ఇందులో కొందరు అనర్హులు కూడా ఉన్నారు. నిర్మాణాలు పూర్తిచేసుకున్న వారికి ప్రభుత్వం సకాలంలో బిల్లులు మంజూరు చేస్తున్నా.. సోమశిల, అనంతసాగరం, మంచాలపల్లి ప్రాంతాల్లో లేఅవుట్లు అడవిని తలపిస్తున్నాయి. ముళ్లపొదలు విస్తారంగా పెరిగాయి. దీంతో గతంలో నిర్మించిన బేస్‌మట్టలు కూడా కనిపించడం లేదు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలు పూర్తిచేసేలా అధికారులు తనిఖీలు చేస్తున్నా ప్రయోజనం అంతంతమాత్రంగా ఉంది. నిర్మాణాల బాధ్యతను కొన్నిచోట్ల గుత్తేదారులకు అప్పగించారు. వారు పట్టించుకోవడం లేదు. సుమారు 1200 గృహాలు మంజూరుకాగా ఇందులో 50 శాతం కూడా పూర్తికాని పరిస్థితి కనిపిస్తోంది.

ప్రభుత్వం అదనపు సాయం

ఇళ్లనిర్మాణాలు పూర్తిచేసుకునే విధంగా ప్రభుత్వం లబ్ధిదారులను పోత్సహిస్తూ అదనపు సాయం అందిస్తోంది. ఎస్సీ, బీసీ, మైనారిటీలకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు ఇస్తున్నారు. అయినా ఆశించిన ఫలితం లేదు. లక్ష్యం అధిగమించేలా చర్యలు వేగవంతం చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

C.R.I.M.E N.E.W.S

ఉద్రిక్తతల నడుమ పసిబిడ్డకు పోస్టుమార్టం

● కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు



ఆసుపత్రిలోకి కుటుంబ సభ్యులను వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్న పోలీసులు

ఉదయగిరి, సెప్టెం బరు 22 (ఆంధ్రజ్యో తి): ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం లో వైద్యుడి నిర్లక్ష్యంతో మృతిచెందిన పసిబిడ్డ మృత దేహానికి ఉద్రి క్తతల నడుమ సోమ వారం పోలీసులు పోస్టు మార్టం నిర్వహించారు. వైద్యుడి నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ చనిపోయిందంటూ తండ్రి చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసిన విషయం విదితమే. అందులో భాగంగా ఉన్నతాధికారుల సూచన మేరకు నెల్లూరు మెడికల్ కళాశాలకు చెందిన ఫోరెన్సిక్ వైద్యుడిని ఉదయగిరికి పిలిపించి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

● కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు

వైద్యులచే పరీక్షించి పసిబిడ్డ మృతదేహాన్ని అప్పగిస్తామని తొలుత పోలీసులు చెప్పారని, మాటమార్చి ప్రస్తుతం పోస్టుమార్టం చేయడం ఏమిటని, దానికి తాము అంగీకరించమని కుటుంబ సభ్యులు ముక్తకంఠంతో నినదించారు. పోస్టుమార్టం చేసేపనైతే తమకు కేసు అవసరంలేదని, బిడ్డను అప్పగిస్తే తీసుకెళతామంటూ తెగేసి చెప్పారు. దీంతో సీఐ వెంకటరావు, ఎస్ఐలు ఇంద్రసేనారెడ్డి, శివకృష్ణారెడ్డిలు సమస్య పైస్థాయి వరకు వెళ్లిందని, కేసు నమోదైందని, పోస్టుమార్టం నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తే వైద్యునిపై చర్యలు తీసుకుంటారని కుటుంబ సభ్యులకు వివరించారు. అయినా వారు ససేమిరా అంటూ మీ కాళ్లమొక్కుతాం సార్.. తల్లికి బిడ్డ చనిపోయాడని చెప్పలేదని, ఆరోగ్యం సరిగాలేక నెల్లూరు తీసుకెళ్లారని చెప్పామని, ఒక్కసారి బిడ్డ ఒంటిపై గాటు లేకుండా అప్పగిస్తే తమ కుమార్తెకు చూపించి తిరిగి ఇస్తామంటూ కన్నీరుమున్నీరయ్యారు. అయినప్పటికీ పోలీసులు పోస్టుమార్టం చేయకుండా బిడ్డను అప్పగించడం కుదరదని, తమకు సహకరించాలని, కుటుంబ సభ్యు లతో సామరస్యంగా మాట్లాడి ఒప్పించారు. పోస్టుమార్టం అనంతరం బిడ్డను కుటుంబ సభ్యులకు అప్పగించడంతో వారు కాన్పయిన తల్లికి బిడ్డను చూపించి చనిపోయిన విషయం తెలిపి ఇంటికి తీసుకెళ్లారు.

కండలేరు కాలువలో ఒకరి గల్లంతు

కలువాయి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): సోమశిల కండలేరు వరద కాలువలో ప్రమాదవశాత్తు పడి ఒకరు గల్లంతైన సంఘటన సోమవారం కలువాయి మండలం కేశమనేనిపల్లి సమీపంలో చోటు చేసుకుంది. గ్రామస్థుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కేశమనేనిపల్లి ఎస్టీ కాలనీకి చెందిన చల్లంచర్ల శీనయ్య, అతని తమ్ముడు కలసి సోమవారం మధ్యాహ్నం పొలం పనులకు వెళ్లారు. అక్కడ పనిలేకపోవడంతో తిరిగి వస్తూ సమీపంలోని కండలేరు కాలువలో చేపల కోసం దిగారు. ప్రమాదవశాత్తు ఇద్దరూ నీటిలో జారిపడ్డారు. చుట్టుపక్కల వారు శీనయ్య తమ్ముడిని మాత్రం తాడు అందించి రక్షించారు. శీనయ్య ప్రవాహంలో గల్లం తయ్యాడు.

సిమెంటు లారీ బోల్తా



బోల్తా పడిన సిమెంట్ లారీ

వింజమూరు, సెప్టె ంబరు 22 (ఆంధ్రజ్యో తి): పాతూరు చెరువు కట్టపై సోమవారం జ మ్మలమడుగు నుంచి కావలికి వెళ్తున్న సిమెంటు లారీ బోల్తాప డింది. ఎదురుగా వస్తు న్న ట్రావెల్ బస్సు సైడ్ ఇవ్వకపోవడంతో బోల్తా పడిందని ఎస్ఐ వీరప్రతాప్ తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదని ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థినుల అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చిన్నబజారు పోలీసుస్టేషన్ పరిధిలో ఇద్దరు విద్యార్థినుల అదృశ్యంపై సోమవారం కేసులు నమోదయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు.. కలువాయి ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థిని వీఆర్సీ కూడలిలోని ఓ కాలేజీలో సీనియర్ ఇంటర్ చదువుతోంది. ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్న ఆ విద్యార్థిని ఈ నెల 21వ తేదీ సాయంత్రం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో వార్డన్ కుటుంబసభ్యులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. చుట్టుపక్కల గాలించినా విద్యార్థిని ఆచూకీ తెలియక పోవడంతో సోమవారం తండ్రి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

● బుచ్చిరెడ్డిపాలెం మండలం మినగల్లుకు చెందిన మరో విద్యార్థిని నగరంలోని వాహెబ్‌పేటలో ఓ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. అదే కాలేజీ హాస్టల్‌లోనే ఉంటోంది. ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం హాస్టల్ వార్డెన్‌కు ఓ వ్యక్తి ఫోన్ చేసి కుటుంబ సభ్యుడిలా మాట్లాడుతూ విద్యార్థిని ఇంటికి పంపాలని కోరాడు. దీంతో ఆమె హాస్టల్ నుంచి వెళ్లిపోయింది. అయితే, తల్లిదండ్రులు సాయంత్రం ఫోన్ చేయడంతో అసలు విషయం బయటపడింది. దీంతో వారు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మొక్కజొన్న రైతు విలవిల

ఉదయగిరి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): వర్షాభావ పరిస్థితులు, పెరిగిన పెట్టుబడులు, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని రేయింబవళ్లు కష్టించి సాగు చేసిన పంట తీరా చేతికందే సమయంలో దిగుబడి రాక, మద్దతు ధర లేక కర్షకుడు కుదేలవుతున్నాడు. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం, బహిరంగ మార్కెట్‌లో ఆశించిన మేర ధర లేకపోవడంతో పంట సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా కష్టమేనంటూ మొక్కజొన్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● 160 ఎకరాల్లో సాగు

ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలో మెట్ట పంటలు అత్యధికంగా సాగు చేస్తారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో 160 ఎకరాల్లో పంట సాగు చేశారు. ప్రస్తుతం కోతలు ముగిసి పంట విక్రయానికి రైతులు సిద్ధంగా ఉన్నారు. ఎకరా మొక్కజొన్న పంటకు దున్నకం, విత్తనాలు, మందులు, పంట కోత తదితరాలు కలిపి రూ.20 నుంచి రూ.25 వేల పెట్టుబడి అవుతుందని రైతులు తెలుపుతున్నారు. ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ఈ ఏడాది 10 నుంచి 15 క్వింటాళ్ల మాత్రమే దిగుబడి రావడం, క్వింటా రూ.2,000 నుంచి రూ.2,200 పలుకుతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. ఏడాదికేడాది పంట సాగుకు పెట్టుబడులు పెరగడం, దిగుబడులకు మద్దతు ధర లేకపోవడంతో పంట సాగు తగ్గుతోందంటున్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	128
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	256

కోడిగుడ్ల ధర (100): 560

పరిశుభ్రతే లక్ష్యం

అల్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం అల్లూరు నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో అల్లూరు రామకృష్ణ జూనియర్ కళాశాల, జడ్పీ ఉన్నత పాఠశాలల ఆవరణలను పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబరు 2 వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజూ పరిసరాలను పరిశుభ్రం చేయడమే లక్ష్యంగా కొనసాగిస్తున్నట్లు ఆయన తెలిపారు. చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, డీడీవో వరప్రసాద్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పరిసరాలు శుభ్రం చేయిస్తున్న కమిషనర్ ఉమామహేశ్వరరావు

అధ్యక్షా...

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించి, రైతులను ఆదుకోండి

● కావలి ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి



కావలి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించి, ఆదుకోవాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనందున దళారులు ధాన్యం ధరలను పుట్టికి రూ.5,725 తగ్గించి రైతులను దోపిడీ చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.19,725 ఉండగా రైతులు మార్కెట్‌లో రూ.14,000లకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అకాల వర్షాల వల్ల వరి పైరు నేలకొరగడంతో రైతులు మరింత నష్టపోతుండగా, దీనిని కూడా ఆసరాగా చేసుకుని దళారులు మరింత ధరలు తగ్గిస్తున్నారని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే దళారుల ఆదిపత్యం తగ్గి ధాన్యం ధరలను పెంచుతారని, దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని అన్నారు.

మహిళలకు ఉచిత వైద్యపరీక్షలు

అల్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం 10.30 గంటల నుండి అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు ఆయన తెలిపారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వొద్దు

కావలి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వవద్దని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి కోరారు. ఈమేరకు సోమవారం కావలి ఆర్డీవో ఎం సన్నీవంశీక్రిష్ణను కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల సత్యవతమ్మ, జరుగుమల్లి విజయరత్నం, చౌటూరు లక్ష్మయ్య, జెడ్డా వాసు, ముక్కు మోహన్‌రావు, లక్ష్మీ నర్సు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

వలేటివారిపాలెం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోగా వై శంకర్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సంతమాగులూరు ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై ఇటీవల వలేటివారిపాలెం ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. పీఏ నరేంద్రదేవ్, కార్యాలయ సిబ్బంది శంకర్‌రావును సత్కరించారు.

పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలి

వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రుబీనా సూచించారు. మండలంలోని బంగారక్కపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం 8వ రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాల సందర్భంగా సోమవారం గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎన్‌ఎం విజయకుమారి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

మాతాశిశు సంరక్షణపై అవగాహన

బిట్రగుంట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం తాళ్ళూరులో కోవూరుపల్లి పీహెచ్‌సీ వైద్యులు రామకృష్ణ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మాతాశిశు సంరక్షణపై సీహెచ్‌వో నజీమునీసా, అంగన్వాడీ సూపర్‌వైజర్ సుప్రజ అవగాహన కల్పించారు. డాక్టర్ రామకృష్ణ ఆరోగ్య, అంగన్వాడీ, ఆశా వర్కర్లచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నాగులవరం పీఏసీఎస్ డైరెక్టర్ లక్కాకుల మాధవరావు, స్థానిక నేతలు శ్రీనివాసులు, జయరామయ్య పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు ఆరు అర్జీలు

బిట్రగుంట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బోగోలు తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు పలు సమస్యలపై ఆరు అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి తెలిపారు. వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

పొలాల్లో 'ప్రమాద' ఘంటికలు!

● నేలను తాకుతున్న విద్యుత్ తీగలు ● పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

గుడ్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పొలాల్లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. విద్యుత్ స్తంభాలు నేల కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. విద్యుత్ తీగలు నేలను తాకుతున్నాయి. మండలంలోని జానకంపేటకు తూర్పున ఉన్న పొలాల్లో ఈ ప్రమాదకర పరిస్థితి నెలకొంది. అనేకసార్లు విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేసినా, ఏ మాత్రం పట్టించుకోవడం లేదని, జానకంపేట, చిన్నపవని, పరిసర గ్రామాల రైతులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూగజీవాలను మేత కోసం పొలాలకు తీసుకుపోవాలన్నా, గడ్డి కోసుకురావడానికి వెళ్లాలన్నా విద్యుత్ తీగలు నేలకు తాకుతుండడంతో ప్రాణాపాయం పొంచి ఉందన్నారు. గతంలో ఇక్కడ విద్యుత్ షాకుతో ఓ వ్యక్తి మృతి చెందాడని రైతులు తెలిపారు. ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలు, తీగలను సరిచేయాలని లైన్‌మెన్‌కు ఎన్నిసార్లు చెప్పినా నిర్లక్ష్యం వహిస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, జానకంపేటలో నేలకు వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని రైతులు కోరుతున్నారు.


కూలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం


జానకంపేట పొలాల్లో నేలను తాకుతున్న కరెంట్ వైర్లు

మహిళల ఆరోగ్యంతోనే ఆరోగ్య సమాజం

లింగసముద్రం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇంటిలో మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం, దేశం ఆరోగ్యంగా ఉంటుందని కందుకూరు డిప్యూటీ డి ఎంహెచ్‌వో డా. పద్మజ పేర్కొన్నారు. సోమవారం లింగసముద్రంలోని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డా. పి రమేష్ అధ్యక్షతన జరిగిన 'స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళలందరూ గర్భాశయ, రొమ్ము, నోటి క్యాన్సర్ గురించి అవగాహన కలిగి ఉండాలని, ఆరోగ్యపరంగా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కొంతమంది మహిళలకు పోషకాహార కిట్లను అందజేశారు. వైద్య శిబిరంలో డా. తులసీరాం, డా. కళ్యాణ్‌కుమార్, డా. చంద్రశేఖర్, డా. నాగమణి, డా. విద్యావతి మహిళలకు బీపీ, షుగరు, హెచ్‌బీ, కంటి పరీక్షలు నిర్వహించారు. గర్భాశయ, ఎముకల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పి గురునాథం, అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్, జంపాల శివప్రసాద్, ఈ శ్రీనివాసులు, జనసేన సీనియర్ నాయకుడు కొట్టే వెంకటనారాయణ పాల్గొన్నారు.


పోషకాహార కిట్లను అందుకున్న మహిళలు

రోగులకు ఉచిత వైద్యపరీక్షలు

ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి) : కరేడు పీహెచ్‌సీ పరిధిలోని కే రాజుపాలెంలో 'స్వస్థనారీ- సశక్త్ పరివార్ అభియాన్' వైద్య శిబిరం నిర్వహించినట్లు వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. స్త్రీలకు వచ్చే రక రకాల క్యాన్సర్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రాథమిక దశలోనే క్యాన్సర్లను గుర్తించగలిగితే చికిత్స సులభతరం అవుతుందన్నారు. గర్భిణులు తీసుకోవాల్సిన సమతుల్యమైన ఆహారం, కాన్పుకు ముందు.. తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిల్లలకు సకాలంలో వేయించాల్సిన టీకాలు తదితర విషయాలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, కమ్యూనిటీ హెల్త్ అధికారులు, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల అభివృద్ధే ధ్యేయం

కావలి రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల అభివృద్ధే ధ్యేయం అని నెల్లూరు జిల్లా సంగం డెయిరీ జోనల్ మేనేజర్ వినోద్‌కుమార్ అన్నారు. కావలి మండలం రుద్రకోటలో సోమవారం పాడి రైతులకు బోనస్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వినోద్‌కుమార్ మాట్లాడుతూ సంగం డెయిరీ చైర్మన్ దూళిపాళ్ళ నరేంద్రకుమార్ డెయిరీ ద్వారా వచ్చిన ప్రతి రూపాయి రైతుకే చెందుతుందని, ప్రతి రైతు అభివృద్ధి చెందాలన్నదే ఆయన లక్ష్యం అన్నారు. మద్దూరుపాడు బ్రాంచ్ మేనేజర్ డి శ్రీనివాసరావు మాట్లాడుతూ సంగం డెయిరీ పాడి రైతులకు ఎన్నో ప్రోత్సాహకాలు అందిస్తూ వారి అభివృద్ధికి తోడ్పడుతోందన్నారు. అనంతరం రుద్రకోటలోని 52 మంది రైతులకు బోనస్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాలసేకరణ కేంద్రం కార్యదర్శి మాధవి పాల్గొన్నారు.


రైతులకు అందించిన బోనస్ చెక్కులు

వ్యక్తి మృతిపై కేసు నమోదు

కావలి రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం ముసునూరులో ఉంటున్న కొల్లిబోయిన దేవమణి (32) మృతిపై సోమవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు... గుడ్లూరు మండలం చినలాటరపి గ్రామానికి చెందిన దేవమణి ఏడాది క్రితం వచ్చి ముసునూరులో అద్దె ఇంట్లో ఉంటూ ఇళ్లకు నెంబర్లు వేసే పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో స్నేహితులైన నవీన్, ఆంజనేయులుతో కలసి 21వ తేదీ ఆదివారం తుమ్మలపెంట బీచ్‌కు వెళ్లి అక్కడ బాగా మద్యం సేవించాడు. తిరుగు ప్రయాణంలో మన్నంగిదిన్నె వద్ద దేవమణి బైక్ నడుపుతూ కిందపడిపోయాడు. దీంతో స్వల్పగాయాలతో మత్తులో ఉన్న దేవమణిని స్నేహితులు ఇంటి వద్ద వదిలి వెళ్లిపోయారు. కాగా, తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో దేవమణికి ఫిట్స్ రావడంతో భార్య శ్రీవర్షిణి అతని స్నేహితులకు ఫోన్ చేసిచెప్పి వారితో కలసి ఏరియా వైద్యశాలకు తీసుకువెళ్లింది. వైద్యులు పరీక్షించి దేవమణి మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుని తల్లి లక్ష్మమ్మ తమ కుమారుడి మృతిపై విచారించి న్యాయం చెయ్యాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి ఎస్‌ఐ తిరుమల రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


మృతుడు దేవమణి

సంగం డెయిరీ సేవలను వినియోగించుకోండి

గుడ్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సంగం డెయిరీ సేవలను పాడి రైతులు వినియోగించుకోవాలని జిల్లా సంగం డెయిరీ జోనల్ మేనేజన్ డాక్టర్ వినోద్ కుమార్ సూచించారు. పాజర్లలోని మూడు పాల సేకరణ కేంద్రాల పాడి రైతులతో సోమవారం సమావేశం నిర్వహించారు. పాల ఉత్పత్తులకు మరింత తోడ్పాటునిస్తు సంగం డెయిరీ రైతులకు అండగా నిలుస్తోందన్నారు. డెయిరీ చైర్మెన్ ధూళపాళ్ల నరేంద్రకుమార్ మాట్లాడుతూ సంగం డెయిరీ ద్వారా పాడి రైతులకు వచ్చే ఆదాయాన్ని సంబంధిత రైతులకు అందేలా పారదర్శకతతో నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం 2024- 25 సంవత్సరానికి గాను పాజర్లకు చెందిన 84 మంది రైతులకు రూ. 1,77,374 బోనస్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మద్దూరుపాడు, కావలి బ్రాంచి మేనేజర్ డి శ్రీనివాసులు, రైతులు, సంగం అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.


పాడిరైతులతో మాట్లాడుతున్న సంగం డెయిరీ జోనల్ మేనేజర్ వినోద్ కుమార్

అంగన్‌వాడీల్లో కుళ్లిన కోడిగుడ్లు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు తక్కువ పరిమాణం ఉన్న, కుళ్లిన కోడిగుడ్లను కాంట్రాక్టర్లు సరఫరా చేస్తున్నారు. ఏదో ఒక కేంద్రంలో తరచూ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నా.. సదరు కాంట్రాక్టరుపై అధికారులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. మండలంలో మొత్తం 53 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో మూడేళ్ల లోపు పిల్లలు 929 మంది, ఆరేళ్ల లోపు పిల్లలు 589 మంది, గర్భిణులు 122 మంది, బాలింతలు 164 మంది ఉన్నారు. ఒక్కొక్కరికీ నెలకు 25 చొప్పున ప్రభుత్వం కోడిగుడ్లు పంపిణీ చేస్తోంది. అయితే ఐసీడీఎస్ అధికారులు కాంట్రాక్టర్లు ఇచ్చే మామూళ్లకు ఆశపడి పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు కోడి గుడ్డు నుండి పోషకాలు అందాలంటే.. బరువు 45 గ్రాముల నుండి 55 గ్రాములు ఉండాలని ప్రభుత్వం సూచించింది. కానీ కాంట్రాక్టర్లు సరఫరా చేసే కోడిగుడ్ల బరువు 40 గ్రాముల కన్నా తక్కువ ఉంటోంది. పైగా కుళ్లిపోయిన కోడిగుడ్లను సరఫరా చేస్తుండడం గమనార్హం. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన కోడి గుడ్లు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


పోలినేనిచెరువు అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిపోయిన కోడిగుడ్లు

పాఠశాల అభివృద్ధికి కృషి అభినందనీయం

లింగసముద్రం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల అభివృద్ధికి దాతలు కృషి చేయడం అభినందనీయమని ఎంఈఓ-2 శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వెంగళాపురం పాఠశాలలో పూర్వ విద్యార్థి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నారిబోయిన ముసలయ్య విద్యార్థులకు సుమారు రూ.7 వేల విలువైన గుర్తింపు కార్డులను ఉచితంగా అందించారు. ఎంఈఓ శివకుమార్ మాట్లాడుతూ దాతలు అందించిన ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని విద్యార్థులకు సూచించారు. ముసలయ్యను ఆదర్శంగా తీసుకొని పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎంఈఓ శివకుమార్, కాంప్లెక్స్ చైర్మెన్ యు మాధవరావు, మొగిలిచెర్ల, చినలాటరిపి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కె సూర్యప్రకాశరావు, పి దామోదర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి ఎస్తేర్‌రాణి, ఉపాధ్యాయులు ముసలయ్యను పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. అలాగే మండల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్తేర్‌రాణిని కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి జనార్దన రావు, ఎం అన్నపూర్ణ, కొండలరావు, సుమతి, విద్యార్థులు పాల్గొన్నారు.


ముసలయ్యను సన్మానిస్తున్న ఎంఈవో-2 శివకుమార్, ఉపాధ్యాయులు

వ్యక్తిపై దాడి : కేసు నమోదు

ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి) : నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి చీర కట్టే విషయంలో ఏర్పడిన ఘర్షణ రెండు కుటుంబాల మధ్య కొట్లాటకు దారి తీసింది. ఎస్సై అంకమ్మ కథనం మేరకు.. కొల్లూరుపాడు బీసీ యాదవ కాలనీలో దసరా ఉత్సవాలకు పోలేరమ్మకి తొలిరోజు చీర కట్టేందుకు అమ్మనబ్రోలు శ్రీనివాసులు, బాలయ్య కుటుంబ సభ్యులు, అదే గ్రామానికి చెందిన అమ్మనబ్రోలు ప్రసాదు, వెంకయ్య కుటుంబ సభ్యుల మధ్య వాగ్వాదం ఏర్పడింది. ఆ సమయంలో ఉలవపాడుకు చెందిన మనోజ్‌కుమార్ నచ్చచెప్పే ప్రయత్నం చేశాడు. అమ్మనబ్రోలు శ్రీనివాసులు, బాలయ్యలు సదరు మనోజ్‌కుమార్‌కు మేనమామలు. కాగా ప్రసాదు, వెంకయ్యలతోపాటు వారి బంధువులు అమ్మనబ్రోలు రవి, కిరణ్‌కుమార్, ఆశోక్, మర్రిబోయిన శివశంకర్, అమ్మనబ్రోలు రమేష్‌లు సర్దిచెప్పేందుకు ప్రయత్నిస్తున్న మనోజ్‌కుమార్‌పైకి వచ్చారు. నువ్వు ఇక్కడి ఏందిరా మాట్లాడేది అంటూ కిరణ్, అశోక్ ఇద్దరు మనోజన్‌ను చేతులు పట్టుకోగా రవి గడ్డపారతో తలపై కొట్టాడు. కిరణ్‌కుమార్ కర్రతో మోకాళ్లపై కొట్టాడు. కిందపడిన మనోజ్‌ను మిగిన వాళ్లు కాళ్లచేతులతో కొట్టారు. అక్కడే ఉన్న బంధువులు బాధితుడిని కారులో వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. రిమ్స్ నుంచి బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, దాడిలో పాల్గొన్నవారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దేవీ శరవన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభం

కావలి (టౌన్) సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దేవీ దేవీ శరవన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం పట్టణంలోని అమ్మవారి ఆలయాల్లో వైభవంగా ప్రారంభమయ్యాయి. పట్టణ గ్రామదేవతగా పూజలందుకుంటున్న కలుగోళశాంభవీ అమ్మవారి ఆలయంలో అమ్మవారు బాలత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వగా, రాత్రి గజవాహన సేవతో గ్రామోత్సవం నిర్వహించారు. పాతూరు శివాలయంలో దుర్గాభ్రమరాంబ అమ్మవారు బాలత్రిపురసుందరీదేవి అలంకారంలో దర్శనమివ్వగా రాత్రి దేవీ ఆలయ ఉత్సవం నిర్వహించారు కన్యకాపరమేశ్వరీ అమ్మవారు బాలత్రిపురసుందరీదేవి అలంకారంలో, వడ్డిపాలెంలోని కనకదుర్గ అమ్మవారు కనకదుర్గా అలంకారంలో, విష్ణాలయంలోని రాజ్యలక్ష్మీ అమ్మవారు రాజ్యలక్ష్మీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

● **అల్లూరు** : మండలంలోని అన్ని శక్తి ఆలయాల్లో సోమవారం నుంచి దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అల్లూరులోని పోలేరమ్మ ఆలయం, పార్వతీ అమ్మవారి (దసరా దేవాలయం), కలుగోళమ్మ, గంగమ్మ, కన్యకాపరమేశ్వరి ఆలయాలతోపాటు బీసీ కాలనీ సమీపంలోని వృక్ష పోలేరమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వృక్ష పోలేరమ్మను ప్రత్యేక పూలాలంకరణ గావించారు. అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలను చేపట్టారు. రాత్రి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు, సురేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● **కందుకూరు** : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని అంకమ్మతల్లి, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, కోదండ రామాలయంలో తూర్పు సాలిపాలెంలో పల్నాటి వీరుల అంకమ్మతల్లి మొదటి రోజు బాలా త్రిపురసుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. దసరా ఉత్సవాల సందర్భంగా అమ్మవార్ల ఆలయాలు విద్యుద్దీపాలంకరణలతో నూతన శోభను సంతరించుకున్నాయి. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

● **ఉలవపాడు** : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. విద్యుద్దీప కాంతులతో నూతన శోభను సంతరించుకున్నాయి. ఉలవపాడులోని అంకమ్మ, కనకదుర్గమ్మ, పోలేరమ్మ, గంగమ్మ, మహాలక్ష్మమ్మ ఆలయాల్లో నవరాత్రుల మొదటి రోజు అమ్మవారు బాలా త్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.


కావలి టౌన్ బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో కలుగోళశాంభవి అమ్మవారు


కందుకూరు :బాల త్రిపుర సుందరి అవతారంలో అమ్మవారు


ఉలవపాడు : బాలా త్రిపురసుందరి అవతారంలో కనకదుర్గమ్మ

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం

కందుకూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): 'మట్టిపాదం' కవయిత్రి, ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా రాష్ట్రస్థాయి పురస్కారం అందుకున్న జీ ఈశ్వరీభూషణంకు సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో దన్యాసి మాల్యాద్రి అధ్యక్షతన అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా 'భాష' పత్రిక సంపాదకులు విద్యాసాగర్, సీపీపల్లి ఎంఈవో సంజీవి, ఆర్ శ్రీనివాసులు, కందుకూరు, కావలి ఎంఈవోలు మనేపల్లి నాగకుమార్ శర్మ, కూనం సుబ్బారెడ్డి, బండి గోవిందయ్య హాజరయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, గురజాడ అప్పారావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల గ్రామం శాఖవరంలోని పేద కుటుంబంలో జన్మించిన ఈశ్వరీభూషణం రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పురస్కారం అందుకుని, అంబేడ్కర్ ఆలోచనా విధానంతో ముందుకెళుతుండడం అభినందనీయమన్నారు. బడిబయట ఉన్న పిల్లలను ఎందరినో బడిబాట పట్టించేలా ఆమె కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు ఈశ్వరీ భూషణంను అభినందించారు.



రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు ఈశ్వరీభూషణం దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, బంధుమిత్రులు

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Atmakur బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన తాకీదు ప్రకారం యావన్మందికి తెలుపునది ...

SCHEDULE

...

Perepi Venugopal, B.Com., B.L., Advocate, Tekkemitta, Nellore. Cell: 8374259528

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Atmakur బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన తాకీదు ప్రకారం యావన్మందికి తెలుపునది ... Sri Gangapatla Murali S/o Veeraraghavulu ...

SCHEDULE

...

Perepi Venugopal, B.Com., B.L., Advocate, Tekkemitta, Nellore. Cell: 8374259528

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Atmakur ...

SCHEDULE

...

Perepi Venugopal, B.Com., B.L., Advocate, Tekkemitta, Nellore. Cell: 8374259528

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
మంగళవారం 23 సెప్టెంబరు 2025

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

అంకురార్పణకు అంతా సిద్ధం

తిరుమల, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో తొలిఘట్టమైన అంకుర్పాణకు సర్వం సిద్ధమైంది. తొమ్మిదిరోజుల పాటు జరిగే ఉత్సవాలు విజయవంతం కావాలంటూ ఆకాంక్షిస్తూ మంగళవారం నిర్వహించనున్నారు. వైఖానస ఆగమ సంప్రదాయం ప్రకారం మంగళవారం రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య నిర్వహించే అంకురార్పణతో బ్రహ్మోత్సవాలకు బీజం పడనుంది. ఆలయంలోని యాగశాలలో అంకురార్పణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. నవధాన్యాలను మొలకెత్తించి ఈ భూమండలమంతా పాడి పంటలతో, పశుపక్ష్యాదులతో సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తారు. శ్రీవారి సర్వసైన్యాధ్యక్షుడు విష్వక్సేనులవారిని ఆలయ నాలుగు మాడవీధుల్లో తొలివాహనంగా ఊరేగిస్తారు. జగద్రక్షకుడైన శ్రీవారికి నిర్వహించే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు విష్వక్సేనులవారు ఈవిధంగా మాడవీధుల్లో ఊరేగుతారని ప్రాశస్త్యం. మరోవైపు రుత్విక్వరణం కూడా విశేషంగా నిర్వహిస్తారు. అర్చకులకు శ్రీవారే విధులు కేటాయిస్తున్నట్టుగా భావించి ఈ తొమ్మిదిరోజుల పాటు ఎవరు ఏ విధులు నిర్వహించాలో ఈ కార్యక్రమం ద్వారా నిర్ణయిస్తారు. దీనికి సంబంధించి సోమవారం సాయంత్రానికే ప్రణాళిక సిద్ధం చేశారు.



ముస్తాబైన కొండ

బ్రహ్మోత్సవ వైభవం మంగళవారం నుంచి మొదలుకానున్న నేపథ్యంలో తిరుమల క్షేత్రాన్ని విద్యుత్ అలంకరణలతో ముస్తాబు చేశారు. శ్రీవారి ఆనందనిలయం నుంచి మహాద్వారం వరకు, గోపురం, ప్రాకారం, ఆలయ పరిసర భవనాలు, ముఖ్య కూడళ్లు, రహదారులు, పార్కుల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణను సోమవారం రాత్రి మరోసారి పరీక్షించి లోటుపాట్లను సరి చేశారు. దీంతో స్వామి క్షేత్రంలో సోమవారం నుంచే బ్రహ్మోత్సవశోభ కనిపించడం మొదలైంది.

మొదలైన సందడి

తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ తక్కువగానే ఉన్నప్పటికీ బందోబస్తు కోసం వచ్చిన పోలీసులు, డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారులు, శ్రీవారిసేవకులతో తిరుమల అంతా సందడిగా కనిపించింది. బుధవారం సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో తిరుమలలో భద్రతా తనిఖీలు ముమ్మరంగా సాగుతున్నాయి. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు జిల్లా అధికారులు, పోలీసులు, ప్రత్యేక దళాలు, బాంబ్, గాడ్ స్క్వాడ్ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేశాయి. సోమవారం రాత్రి చిరుజల్లులు పడటంతో ఉత్సవాలకు స్వామే క్షేత్రాన్ని శుభ్రపరుస్తున్నారని కొందరు భక్తులు వ్యాఖ్యానించారు.

సంతృప్తికరంగా వాహనసేవల వీక్షణ

- మాడవీధుల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- ఆంధ్రజ్యోతితో అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, ఆంధ్రజ్యోతి



'తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా మాడవీధుల్లోని గ్యాలరీల్లోకి చేరే భక్తులకు సంతృప్తికర వాహనసేవల దర్శనం కల్పించేలా పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టాం. నిర్దేశించిన సమయానికి వాహనసేవలు నిర్వహించేలా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించాం. చిన్నపాటి సమస్యకు కూడా అవకాశమివ్వకుండా సూక్ష్మస్థాయిలో ప్లాన్‌ను సిద్ధం చేశాం. తిరుమలకు చేరుకుని గ్యాలరీల్లోకి రావడమే భక్తుల వంతు. మిగిలినదంతా మేమేం చూసుకుంటాం' అని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి చెప్పారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్ల వివరాలు ఆయన మాటల్లోనే..

సాంకేతిక సాయంతో రద్దీ నియంత్రణ

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి క్రౌడ్ మేనేజ్మెంట్‌కు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. టీటీడీ చరిత్రలో తొలిసారిగా ఇస్రో సేవలను ఉపయోగించుకోబోతున్నాం. అలాగే భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు ఈసారి ఎల్అండ్‌టీ కూడా తమ సహకారం ఇవ్వబోతోంది. ఎంతమంది తిరుమలకు చేరినా ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేశాం.

పక్కా ప్రణాళిక

ఈ తొమ్మిదిరోజుల ఉత్సవాలను ఎలా నిర్వహించాలనే అంశంపై ఇప్పటికే అన్ని విభాగాల అధికారులకు, సిబ్బందికి పక్కా ప్రణాళికలతో సూచనలు చేశాం. ముందస్తుగా తయారు చేసిన ప్లాన్ ప్రకారమే అన్నిటినీ అమలు చేయబోతున్నాం.

గట్టి భద్రత

4,700 మంది పోలీసులు, 2 వేల మంది విజిలెన్స్, వెయ్యిమంది టీటీడీ ఉద్యోగులు, 3,500 మంది శ్రీవారిసేవకులు, 2,100 మంది పారిశుధ్య కార్మికులు ఇలా పదివేల మందికిపైగా భక్తులకు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారు.

CTBTA DATE 23-09-2025
TODAY'S LIVE BIRDS & CHICKEN PRICES
CHITTOOR TIRUPATI BROILER TRADERS ASSOCIATION

టుడే సప్లై రేట్ 120/-	డ్రెస్డ్ స్కిన్‌తో 220/-
రిటైల్ లైవ్ బర్డ్ 145/-	స్కిన్‌లెస్ 245/-

గరుడసేవపై ప్రత్యేక దృష్టి

ప్రధానంగా గరుడసేవకు ఎలాంటి సమస్యల ఉత్పన్నం కాకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. గ్యాలరీల్లోకి చేరే భక్తులే కాకుండా వెలుపల ఉండే యాత్రికులకూ ఎలాంటి సౌకర్యాలు కల్పించాలనే అంశంపై దిశానిర్దేశం చేశాం. సరైనా కోఆర్డినేషన్‌తో స్వామి ఉత్సవాలను సక్సెస్ చేస్తాం.

రేపు ఉప రాష్ట్రపతి, సీఎం రాక

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుమలకు బుధవారం ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు రానున్నారు. బుధవారం రాత్రికి ఉప రాష్ట్రపతి దంపతులు ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి.. అక్కడ్నుంచి తిరుమలకు చేరుకుని బస చేస్తారు. గురువారం ఉదయం 7 గంటలకు స్వామి వారిని దర్శించుకుంటారు. మధ్యాహ్నం 12.30 గంటలకు తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమవుతారు. ఇక, సీఎం చంద్రబాబు ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో తిరుపతికి, అక్కడ్నుంచి తిరుమలకు వెళ్లనున్నారు. శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించాక, పెద్ద శేష వాహనసేవలో పాల్గొంటారు. గురువారం ఉదయం పీఏసీ-5 సముదాయాన్ని ప్రారంభించి తిరుగు ప్రయాణమవుతారు. వీరిద్దరి పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం బన్సల్, కమిషనర్ మౌర్య, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి తదితరులు సమీక్షించారు. వీఐపీల పర్యటన ప్రాంతాలను పరిశీలించారు.

తిరుమల వైకుంఠంలో అత్యాధునిక నిఘా వ్యవస్థ

- 25న సీఎంచే ప్రారంభం?

తిరుమల, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): తిరుమలలో నిఘా వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేసేందుకు అధునాతన ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)ను టీటీడీ ఏర్పాటు చేసింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 25వ కంపార్టుమెంట్‌లోని ఐసీసీసీని సీఎం చంద్రబాబుతో గురువారం ప్రారంభించే యోచనలో టీటీడీ ఉంది. భక్తుల రద్దీ నియంత్రణ, దర్శనాల నిర్వహణతో పాటు సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ బెదిరింపుల నుంచి టీటీడీ వ్యవస్థను పరిరక్షించేందుకు ఇది ఉపయోగపడుతుంది. భక్తుల రద్దీని ఆర్టిఫిషయల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సాయంతో ఎప్పటికప్పుడు అంచనా వేయడం, దర్శనానికి ఖచ్చిత సమయాన్ని లెక్కకట్టడం, దర్శనానికి వచ్చే భక్తుల పూర్తి వివరాల నమోదు, హెడ్ కౌంట్ వంటివి దీనితో సులువవుతాయి. విపత్తు సమయాల్లో డ్రోన్ల ద్వారా సహాయాన్నీ ఐసీసీసీ ద్వారా చేపట్టనున్నారు. భవిష్యత్తులో క్వాంటమ్ టెక్నాలజీని వినియోగించుకునేలా ఐసీసీసీలో ముందస్తు ఏర్పాట్లు చేశారు.

ధ్వజారోహణానికి చెల్లూరు దర్భ

- దీనితో 22 అడుగుల చాప, 225 మీటర్ల తాడు



తిరుమల, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): ధ్వజారోహణానికి వినియోగించే దర్భ చాప, తాడు ఊరేగింపుగా సోమవారం తిరుమల ఆలయానికి చేరాయి. టీటీడీ అటవీ విభాగం దర్భను సేకరించింది. టీటీడీ ఫారెస్ట్ డిపోలో అంతకుముందు వీటికి నిర్వహించిన పూజలో డీఎఫ్‌వో ఫణికుమార్ నాయుడు, ఎఫ్ఆర్వోలు పాల్గొన్నారు. రంగనాయక మండపంలో శేషవాహనంపై వీటిని ఉంచారు. బుధవారం సాయంత్రం 5.43 నుంచి 6.15 గంటల మధ్య మీనలగ్నంలో నిర్వహించే ధ్వజారోహణంలో వీటిని ఉపయోగిస్తారు.

తిరుమలలో వాడేది విష్ణుదర్భ

దర్భ చాపను ధ్వజస్తంభం చుట్టూ చుడతారు. దర్భతో పేనిన తాడును ధ్వజస్తంభంపైవరకు చుడతారు. దర్భలో శివ దర్భ, విష్ణు దర్భ అని రెండు రకాలుంటాయి. తిరుమలలో విష్ణు దర్భనే వినియోగిస్తారు. ఏర్పేడు మండలం చెల్లూరు గ్రామంలో విష్ణుదర్భను టీటీడీ అటవీశాఖ సేకరిస్తుంది. వారం రోజుల పాటు ఎండబెట్టి శుభ్రపరుస్తారు. 22 అడుగు పొడవు, ఏడున్నర అడుగుల వెడల్పుతో 60 కిలోల బరువైన దర్భ చాపను అల్లుతారు. 255 మీటర్ల పొడవైన 106 కిలోల తాడును పేనుతారు.



కలెక్టర్‌కు అధికారుల అభినందన

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్వర్ణనారావారిపల్లె ప్రాజెక్టుకు స్కోచ్ సంస్థ నుంచి అవార్డు అందుకున్న కలెక్టర్ వెంకటేశ్వర్‌ను సోమవారం అధికారులు అభినందించారు. ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం బన్సల్, కమిషనర్ మౌర్య, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, డీపీవో సుశీలాదేవి అభినందనలు తెలిపారు. కలెక్టర్ కేక్ కట్ చేశారు.

ఎలక్ట్రిక్ బస్సుల్ని తిరుమలకు తిప్పాల్సిందే



మాట్లాడుతున్న ఈడీలు చెంగల్‌రెడ్డి, చంద్రశేఖర్, డీపీటీవో జగదీష్

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని వంద ఎలక్ట్రిక్ బస్సులనూ తిరుమలఘాట్‌లోనే తిప్పాలని ఆర్టీసీ ఈడీలు చెంగల్‌రెడ్డి, చంద్రశేఖర్ ఆదేశించారు. మదనపల్లె, నెల్లూరు, కడపలకు తిరుగుతున్న బస్సులనూ తిరుమలకు నడపాలన్నారు. తిరుపతిలో సోమవారం వీరు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. స్త్రీశక్తి పథకం నేపథ్యంలో ఎక్కువ మంది భక్తులు వచ్చినా ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. గరుడసేవకు నిమిషానికొక బస్సు నడిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. సమీక్షలో డీపీటీవో జగదీష్, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, సీఎంఈ బాలాజీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైద్యం కోసం వెళ్తూ...

- కారు ఢీకొని తల్లీకొడుకుల దుర్మరణం





మృతి చెందిన మునెమ్మ, బాలాజీ

నారాయణవనం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైద్యం కోసం వెళ్తున్న తల్లీకొడుకులను కారు ఢీకొని దుర్మరణం చెందారు. నారాయణవనం మండలం టాసా ఫ్యాక్టరీ వద్ద సోమవారం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. చిత్తూరు జిల్లా నింద్ర మండలం ఐఆర్‌కండ్రిక చెందిన మునెమ్మ(47)ను ఆమె కుమారుడు బాలాజీ(28) ద్విచక్ర వాహనంలో ఎక్కించుకుని తిరుపతిలోని ఆస్పత్రికి బయలుదేరారు. టాసా ఫ్యాక్టరీ వద్ద పాలమంగళం నుంచి వస్తున్న కారు వీరి బైకును ఢీకొనడంతో తల్లీకొడుకులు ఎగిరి రోడ్డు మీద పడి అక్కడికక్కడే మృతి చెందారు. మునెమ్మ భర్త కేశవులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాలను పుత్తూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాలాజి చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు. భార్య, కుమారుడి మృతదేహాలను చూసి విలపిస్తున్న కేశవులును ఓదార్చడం ఎవరివల్ల కాలేదు.

డ్వాక్రా సభ్యులకు రూ.11లక్షల టోకరా

తిరుపతిరూరల్, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాలకు చెందిన రూ.11లక్షలకుపైగా మొత్తాన్ని ఓ సంఘమిత్ర స్వాహా చేసిన ఘటన బయటపడింది. వివరాలిలా.. తిరుపతి రూరల్ మండలం కుంట్రపాకం పంచాయతీలోని ఎస్టీకాలనీలో మూడు డ్వాక్రా సంఘాలున్నాయి. ఈ సభ్యులకు తెలియకుండా రూ.11లక్షలకు పైగా సొమ్మును విడతలవారీగా సంఘమిత్ర చెంచులక్ష్మి తీసుకున్నారు. అడిగినప్పుడల్లా బ్యాంకులో చెల్లించామని చెప్పేవారు. వార్షిక బడ్జెట్- జీవనోపాధుల ప్రణాళికలో బయోమెట్రిక్ వేసిన సందర్భంలో బ్యాంకులో అప్పు ఉన్నట్లు సభ్యులు గుర్తించారు. అనుమానంతో బ్యాంకు పుస్తకాలను తీసుకురమ్మంటే సంఘమిత్ర దాటవేత ధోరణితో సమాధానం చెప్పేవారు. దీంతో బ్యాంకు స్టేట్‌మెంట్ పరిశీలించగా రూ.11లక్షలకుపైగా స్వాహా చేసినట్లు గుర్తించారు. దీనిని 'మనడబ్బులు- మనలెక్కలు' యాప్ ద్వారా ధ్రువీకరించుకున్నారు. దీనిపై మండల వెలుగు ఏపీఎం నాగేశ్వరరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. రూ.11లక్షలు స్వాహా చేసినట్లు గుర్తించామన్నారు. విచారణ జరిపి. రికవరీకి చర్యలు చేపడతామన్నారు.

25న డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు

- రేపు ప్రయాణానికి రిజిస్టర్ చేసుకోవాలన్న డీఈవో

తిరుపతి(విద్య), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ఈనెల 25వ తేదీన అమరావతిలో సీఎం చంద్రబాబు నియామక పత్రాలు అందజేయనున్నారు. దీనికిగాను అభ్యర్థులు బుధవారం ఉదయం 7 గంటలకు తిరుపతి- రేణిగుంట రోడ్డులోని చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల వద్ద రిజిస్టర్ చేసుకోవాలని డీఈవో కుమార్ సూచించారు. అభ్యర్థితో పాటు మరో సహాయకులకు అవకాశం ఉందన్నారు. అమరావతికి తీసుకెళ్లేందుకు ప్రయాణ, భోజన, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు తిరుపతిలో నింగి నుంచీ నిఘా

- 10 డ్రోన్లు వినియోగించనున్న పోలీసులు
- పార్కింగ్ ప్రదేశాల్లో సీసీ కెమెరాలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుమల కొండపై శ్రీవారి బ్రహ్మోత్సవాలు. భక్తులంతా తిరుపతి మీదుగానే రాకపోకలు సాగిస్తారు. ఆ రద్దీ ప్రభావం నగరంలోనూ కనిపిస్తుంది. ఈ క్రమంలో తిరుపతిలో భద్రతపై పోలీసులు దృష్టి పెట్టారు. ఇప్పటికే ఎస్పీ సుబ్బరాయుడు, డీఎస్పీ భక్తవత్సలం, ఇతర పోలీసు అధికారులతో నాలుగైదు సార్లు సమావేశమయ్యారు. ఎక్కడా తొక్కిసలాటకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టడంపై చర్చించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని నిర్ణయించారు. అత్యాధునిక పది డ్రోన్లతో నింగి నుంచి తిరునగరిపై నిఘా పెట్టనున్నారు. వీటిల్లో టెథర్ డ్రోన్‌ను బస్టాండు, రైల్వే స్టేషన్‌లో మాత్రమే వినియోగిస్తారు. మిగిలిన థర్మల్ డ్రోన్‌ను తిరుపతి నగరమంతా వినియోగించి ఎక్కడైనా అసాంఘిక శక్తులు తలదాచుకున్నా, తొక్కిసలాటకు ఆస్కారమున్నా పరిశీలిస్తారు. అనుక్షణం భక్తుల రాకపోకలపై డ్రోన్ల ద్వారా కమాండ్ కంట్రోలు యూనిట్ నుంచి ప్రత్యేక బృందాలు పర్యవేక్షిస్తాయి. ఇక, టీటీడీ వసతి సముదాయాలు, అలిపిరి బైపాస్ రోడ్డు, గరుడ, నంది సర్కిల్, ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్‌లో భక్తులు తిరగలాడే ప్రాంతాల్లో డీజేఐ 3ఎస్ డ్రోన్లతో పాటు హై సెక్యూరిటీ లెన్స్ కలిగిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. అలిపిరి చెక్ పాయింట్, గరుడ విగ్రహం, కాలినడకన వెళ్లే భక్తుల కోసం రోప్ పార్టీలు, విజిలెన్సు సిబ్బంది, పోలీసులను నియమించారు.



అదనంగా ఐదు హోల్డింగ్ పాయింట్లు

వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చే వామనాలకు అదనంగా ఐదు హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. దేవలోక్, బాల విజ్ఞాన్ భవన్, నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండు, ఇస్కాన్ గ్రౌండులో పార్కింగ్ ప్రదేశాలు సిద్ధం చేశారు. ఇవి నిండిపోతే నెల్లూరు వైపు నుంచి వచ్చే వాహనాలను మామిడికాయల మండీ.. కడప నుంచి వచ్చే వాహనాలను శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాల.. చిత్తూరు వైపు నుంచి వచ్చే వాహనాలను చెర్లోపల్లె వద్ద ఆపాలి. ఆయా పార్కింగ్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, బందోబస్తు, ఫుడ్ స్టాళ్లు, టాయిలెట్లు తదితర వసతులను టీటీడీ సమకూరుస్తోంది.

700 మందితో భారీ బందోబస్తు

తిరుపతిలో 700 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అదనపు ఎస్పీ, డీఎస్పీ ఆధ్వర్యంలో 10 మంది సీఐలు, 50 మంది ఎస్ఐలు, మరో 300 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులను బందోబస్తు కోసం నియమించారు. వీరు కాకుండా పారా మిలటరీ బలగాలు, రోప్ పార్టీలు, బాంబు, డాగ్ స్క్వాడ్లు, డిగ్గింగ్ పార్టీలు, మెటల్ డిటెక్టర్లు, లగేజీ తనిఖీ స్కానర్లు ఏర్పాటు చేస్తున్నారు. గరుడ సేవకు మళ్లీ అదనపు సిబ్బందిని నియమించనున్నారు.

GITAM
SCHOOL • JUNIOR COLLEGE
Recognised by Govt. of A.P
TIRUPATI
School : • Nursery to X Class
• IIT / MEDICAL Foundation From Class VI
Jr. College Courses :
• MPC + EAPCET
• MPC + IIT (JEE Advanced)
• BiPC + NEET
• CEC
• MEC } + CA-CPT
K.T.Road, Bhavani Nagar Circle, TIRUPATI. Ph : 0877-2225115, 9390210501

GATE DEGREE & P.G. COLLEGE
(Approved by AICTE, New Delhi & Affiliated to Sri Venkateswara University, TIRUPATI)
• హాస్టల్ వసతి • బస్సు సౌకర్యం
SC, ST, BC & OC
విద్యార్థులకు స్కాలర్‌షిప్ మరియు ఫీజు రీయింబర్స్‌మెంటు సౌకర్యం కలదు
ICET CODE : GTMT
MBA • MCA
DEGREE COURSES
• B.Com (CA)
• B.Sc. Biotechnology
• B.Sc. Comp. Science
• B.Sc. DATA SCIENCE
• BCA ARTIFICIAL INTELLIGENCE
• BCA DATA SCIENCE
• BCA • BBA
Bhavani Nagar Circle, TIRUPATI. Ph : 0877- 2286423,
Cell : 99632 59463, 9440074119, 8099088704, 9989294144

'ఆల్మట్టి' ఎత్తు పెంచొద్దు : బీజేపీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచాలన్న నిర్ణయాన్ని బీజేపీ వ్యతిరేకిస్తోందని ఆ పార్టీ నాయకులుత తెలిపారు. ఎత్తు పెంచితే శ్రీశైలం డ్యామ్ కృష్ణా జలాలను కోల్పోతుందని, రాష్ట్ర శ్రేయస్సు కోసం స్పష్టమైన విధానాన్ని అనుసరించాలని తెలుగుగంగ ప్రాజెక్టు ఎస్‌ఈ రాధాకృష్ణ రెడ్డికి సోమవారం వినతిపత్రం అందించారు. నాయకుడు మిడతల రమేష్ మాట్లాడుతూ కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచాలని నిర్ణయించిందని, దీనిని తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకించిందని, కర్ణాటక ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొట్లూరు శ్రీనివాసులు, రాజేశ్వరమ్మ, నరాల సుబ్బారెడ్డి, సృజన పద్మ తదితరులు పాల్గొన్నారు.

కోనలో వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

రాపూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన క్షేత్రంలో పెంచల నృసింహుడి పట్టమహిషి ఆదిలక్ష్మీ అమ్మవారి శరన్నవ రాత్రి మహోత్సవాలు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సోమవారం కలశ స్థాపనతో వైభవంగా ప్రారంభమయ్యాయి. మూలవిరాట్‌ను బంగారు చీరలో విశేషంగా అలంకరించి, అర్చకులు కలశస్థాపన చేసి పూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవారు సౌభాగ్యలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తిరు ఆలయం వద్ద విద్యుద్దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంటోంది. ఈ కార్యక్రమాలు ఆలయ ఉపకమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు. అలాగే పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో కలశ స్థాపన, ఊరేగింపు దేవస్థాన ప్రెసిడెంట్ మెంటా నారాయణశెట్టి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. రాత్రికి అమ్మవారు బాలాత్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.


నెల్లూరులో మూలస్థానేశ్వరుడి ఆలయంలో నృత్యం చేస్తున్న చిన్నారి


రాపూరు : పెంచలకోనలో సౌభాగ్యలక్ష్మిగా ఆదిలక్ష్మి


నెల్లూరు : రాజరాజేశ్వరిగా ఇరగాళమ్మ అమ్మవారు


నెల్లూరు : చండీ అలంకరణలో రాజరాజేశ్వరి


నెల్లూరు రూరల్ : వేదగిరిపై ఆదిలక్ష్మిగా ఆదిలక్ష్మి అమ్మవారు


సంగం : బాలత్రిపురసుందరిగా కామాక్షిదేవి

నవ దుర్గాయై నమః

వైభవంగా శరన్నవరాత్రి వేడుకలు ప్రారంభం

వివిధ అలంకారాల్లో జగన్మాత కనువిందు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు సోమవారం ఉదయం వైభవంగా ప్రారంభ మయ్యాయి. నవదుర్గల అలం కారాల్లో అమ్మవార్లు భక్తులకు దర్శనం ఇచ్చా రు. జైభవానీ, జైజై భవానీ అంటూ భక్తుల నామస్మరణ ఆలయ పరిసరాల్లో మారుమోగింది. తొలిరోజు కలశ స్థాపనతో వేడుకలు ప్రారంభమయ్యాయి. నెల్లూరులోని కన్యకాపరమేశ్వ రి ఆలయం ఆధ్వర్యంలో 1008 మంది సువాసినులు ఎర్రటి వస్త్రాలు ధరించి రంగనాథ స్వామి ఘాట్ నుంచి పెన్నానదీ జలాలు సేకరించారు. అనంతరం వెండి రథంలో కన్యకాపరమేశ్వరిగా మంగళవాయిద్యాలు, మేళతాళాలతో జైవాసవీ, జైజై వాసవీ అనే నామస్మరణలతో ఊరేగింపుగా కన్యకాపరమేశ్వరి ఆలయానికి చేరుకున్నారు. కలిశోత్సవంలో పాల్గొన్న ప్రతి మహిళకు కుబేర యంత్రాన్ని బహూకరించారు. రాజరాజేశ్వరి ఆలయంలో సంపుటీకరణ, చండీహోమాలు ప్రారంభమయ్యాయి. అలాగే జొన్నవాడ, పెంచలకోన, వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కావలి కలుగోళమ్మలతోపాటు అన్ని ఆలయాల్లో కలిశ స్థాపనలతో ఉత్సవాలు వైభవం గా ప్రారంభమయ్యాయి. భక్తులు తొలిరోజే ఆలయాలకు పోటెత్తారు.



రాజరాజేశ్వరి ఆలయంలో భక్తుల సందడి

వీఎస్‌యూ విద్యార్థికి రాష్ట్రపతి అవార్డు

వెంకటాచలం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ వలంటీర్ ఎం. పథ్వీరాజ్‌కు రాష్ట్రపతి అవార్డు దక్కడం యూనివర్సిటీకే గర్వకారణంగా ఉందని వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో సోమవారం పృథ్వీరాజ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా వీసీ విలేకరులతో మాట్లాడారు. ఈనెల 29న ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా పృథ్వీరాజ్ ఈ అవార్డును అందుకోనున్నాడని తెలిపారు. మూడేళ్లగా ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన వీఎస్‌యూ విద్యార్థులకు వరుసగా రాష్ట్రపతి అవార్డులు లభిస్తుండడం విశేషమన్నారు. వీఎస్‌యూ పొందుతున్న ఈ అవార్డులు కేవలం వ్యక్తిగత కృషి ఫలితం మాత్రమే కాదని, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది మధ్య సమన్వయ ఫలితమేనన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కే. సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.


వలంటీర్ పృథ్వీరాజ్‌ను అభినందిస్తున్న వీసీ శ్రీనివాసరావు తదితరులు

జేసీగా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ



నెల్లూరు (హరనాథపురం); సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా జాయింట్ కలెక్టర్‌గా మొగిలి వెంకటేశ్వర్లు సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తహసీల్దారుగా జిల్లాలో పనిచేసిన అనుభవం తనకు ఉందని అన్నారు. నిబంధనల మేరకు తాను పని చేస్తానని, దస్త్రాలు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కస్తామని చెప్పారు. కలెక్టర్ ఆదేశాలు పాటిస్తూ జిల్లా మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

కన్నకొడుకే గూడు లేకుండా చేశాడయ్యా!



ఇంటిని అక్రమంగా రాయించుకున్నాడు!

కలెక్టర్‌కు ఓ వృద్ధురాలి మొర

న్యాయం చేస్తామని బాధితురాలికి హామీ


ఈ వృద్ధురాలి పేరు ఎం.రమాజ్యోతి. కావలిలోని అరటితోట ప్రాంత వాసి. తన కుమారుడు మోసం చేసి ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని వాపోతూ సోమవారం నెల్లూరులోని కలెక్టరేట్‌కు చేరుకుంది. ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన హిమాన్షు శుక్లా ఆ వృద్ధురాలి నుంచి తొలి అర్జీ అందుకున్నారు. నడవలేని స్థితిలో కలెక్టరేట్‌కు చేరుకుని రమాజ్యోతి వద్దకే కలెక్టర్ చేరుకుని ఆమె సాధక బాధకాలు విన్నారు. ఈ సందర్భంగా రమాజ్యోతి మాట్లాడుతూ తన కుమారుడు ఎం. శ్రీనివాసులు మోసం చేసి తన ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు కన్నీటి పర్యంతమైంది. తనకు అన్నం, నీరు కూడా ఇవ్వకుండా చేశాడని వాపోయింది. ఆ ఇంటి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయించి, తన ఇంటిని తనకు చెందేలా చేయాలని కలెక్టర్‌ను ఆ వృద్ధురాలు వేడుకుంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారుల ద్వారా విచారించి సమస్యను వెంటనే పరిష్కరిస్తానని అన్నారు.

- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)

ధర తగ్గింది.. కొన్నిచోట్లే!

పాత సరుకు పేరుతో పాత ధరే

- అమలులోకి జీఎస్టీ తగ్గుదల
- ఎలక్ట్రానిక్ బిల్లులున్న చోట మాత్రం అమలులోకి..
- అన్ని వర్గాల్లోనూ వెల్లివిరుస్తున్న ఆనందం



నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జీఎస్టీ (వస్తు వినియోగ పన్ను) సంస్కరణల ప్రభావం జిల్లాలో ఇంకా పూర్తిస్థాయిలో కనిపించడం లేదు. అనేక వస్తువులపై జీఎస్టీ తగ్గినా ఆ ఫలితం సామాన్యులకు అందేందుకు కొంత సమయం పట్టేలా కనిపిస్తోంది. ప్రధానంగా నిత్యావసరాల విషయంలో ఈ పరిస్థితి ఉంది. అయితే, ఎలక్ట్రానిక్ బిల్లులు ఇస్తున్న సూపర్ మార్కెట్లలో మాత్రం నిత్యావసరాల ధరలు తగ్గాయి. ఇప్పటివరకూ కొన్ని రకాల నిత్యావసరాలపై 18 శాతం జీఎస్టీ, మరికొన్ని రకాల నిత్యావసరాలపై 12 శాతం జీఎస్టీ ఉండగా, అది సోమవారం నుంచి 5 శాతానికి తగ్గింది. అంటే ఇప్పటి వరకూ అమ్ముతున్న ధరల్లో 13 శాతం ధర తగ్గాల్సి ఉన్నప్పటికీ సాధారణ దుకాణాల్లో పాత సరుకు పేరుతో పాత ధరనే కొనసాగిస్తున్నారు. తమ దగ్గర మరో పది రోజుల వరకూ సరుకు ఉంటుందని, పాత జీఎస్టీ ప్రకారం ఆ సరుకును కొన్నాం కాబట్టి తాము కూడా అదే ధరకు అమ్మకపోతే నష్టం వస్తుందని రిటైల్ వ్యాపారులు చెబుతున్నారు. అయితే పెద్ద సూపర్‌మార్కెట్లలో మాత్రం సోమవారం నుంచి జీఎస్టీ ధరలు తగ్గించారు. ఇక షాపింగ్ మాల్స్, ఎలక్ట్రానిక్ దుకాణాలు, బైకులు, కార్ల షోరూముల్లో తగ్గించిన జీఎస్టీ ధరలు అమల్లోకి వచ్చాయి. ఇక్కడ ఆది, సోమవారాలకు తేడా స్పష్టంగా కనిపించింది. పండుగ సీజన్ కావడంతో షాపింగ్ మాల్స్ కళకళలాడుతున్నాయి. కాగా తగ్గిన జీఎస్టీ ధరల వివరాలు ప్రజలందరికీ తెలిసేలా ప్రతీ దుకాణం ముందు బోర్డులు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. కానీ నెల్లూరులో చాలా చోట్ల వ్యాపారులు బోర్డులు ఏర్పాటు చేయలేదు.



నెల్లూరులోని ఓ షోరూమ్ ముందు జీఎస్టీ తగ్గుదలపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

● తగ్గిన సబ్బులు, బిస్కట్ల ధరలు

కొత్త జీఎస్టీ రేట్లతో వస్తువుల ధరలు తగ్గాయి. సబ్బులు, టూత్‌పేస్టులు, పాలు, డైరీ ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఔషధాలు, ఆటోమొబైల్స్, వాషింగ్ పౌడర్లపై జీఎస్టీ తగ్గింది. చిన్నకార్లపై పన్ను కొంత తగ్గించగా, ఎలక్ట్రిక్ వాహనాలపై మరింత పన్ను రాయితీ అందింది. గృహోపకరణాల వంటి వాటిపై పన్ను తగ్గింది. ఉదాహరణకు సబ్బుల మీద ప్రస్తుతం 18 శాతం జీఎస్టీ ఉండగా 5 శాతానికి తగ్గింది. సింథాల్ సబ్బు ధర రూ.50గా ఉండగా, జీఎస్టీ తగ్గుదలతో రూ.45లకు చేరుకుంది. హమామ్ సబ్బు రూ.45 నుంచి 40లకు, 4 లైఫ్‌బాయ్ సబ్బుల ప్యాక్ ధర రూ.68 నుంచి 60కి తగ్గింది. 200 గ్రాముల హార్లిక్స్ ధర రూ.130 నుంచి 110లకు, 200 గ్రాముల కిసాన్ జామ్ ధర రూ.90 నుంచి 80లకు తగ్గింది. జీఎస్టీ తగ్గింపు ధరతో కూడిన కొత్త సబ్బులు మార్కెట్‌లోకి వచ్చాయి. ముఖ అందానికి వినియోగించే పౌడర్ల ధరలు కూడా తగ్గాయి. రూ.150 ఉన్న టాల్కం పౌడర్ డబ్బా 140కి తగ్గింది. స్నానానికి వినియోగించే షాంపుల ధర కూడా దిగి వచ్చింది. ఉదాహరణకు సన్ సిల్క్ షాంపు ఎంఆర్‌పీ రూ.469 ఉంటే జీఎస్టీ తగ్గింపునకు ముందు రూ.430లకు విక్రయించేవారు. సోమవారం రూ.419లకే ఇస్తున్నారు. డవ్ షాంపు 340 ఎంఎల్ ధర రూ.490 ఉంటే, రూ.435లకు తగ్గింది.

● చిన్నకార్లపై ఇప్పటివరకు 22 శాతం జీఎస్టీ ఉండగా, 18శాతానికి తగ్గింది. దీనివల్ల రూ.7లక్షల కారుపై సుమారు రూ.35వేల వరకు తగ్గింది. ఫ్రిజ్‌లపై 18 శాతం ఉన్న జీఎస్టీ 12శాతానికి తగ్గటంతో రూ.20వేల ఫ్రిజ్‌పై రూ.1200 వరకు తగ్గింది. రూ.10వేలు ఉన్న ఓవెన్‌పై రూ.600 తగ్గింది. వాషింగ్ మిషన్‌పై వున్న 18శాతం జీఎస్టీ 12 శాతానికి తగ్గటంతో రూ. 15వేల విలువైన వాషింగ్ మిషన్‌పై రూ.900 తగ్గింది. ఇంటి కొనుగోలు, నిర్మాణ దారులకు జీఎస్టీ ద్వారా భారీగా ప్రయోజనం కలగనుంది. వీటిపై 28 శాతంగా ఉన్న జీఎస్టీ 18శాతానికి తగ్గింది. దీంతో నిర్మాణ ఖర్చు తగ్గింది.

కొనుగోళ్లు పెరుగుతున్నాయ్!



జీఎస్టీ తగ్గింపును అమలు చేస్తున్నాం. ఇప్పటికే సబ్బులు, పౌడర్‌లు జీఎస్టీ తగ్గింపు ధరలతో వచ్చాయి. అయితే బిస్కట్లు తదితరాలపై ధర పెంచకుండా వాటి బరువు పెంచి బిస్కట్లు తయారై వస్తున్నాయి. దీంతో బరువు పెరిగిన బిస్కట్ జీఎస్టీ తగ్గిన ధరకే వస్తుంది. జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రయోజనం ఏమీ లేదని కొందరు అనటం సరికాదు. జీఎస్టీ తగ్గింపు వల్ల వినియోగదారుకు వస్తువుల ధరలు తగ్గుతాయి. అమ్మకాలు పెరడం వల్ల వ్యాపారి కూడా ఆనందపడతాడు.

- వాకాటి శేఖర్, నెల్లూరు

ధరలు తగ్గడం మంచిదే



నిత్యావసర వస్తువుల ధరలు తగ్గితే మాలాంటి చిన్న వ్యాపారులకు ఎంతో మేలు. ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడం శుభపరిణామం. నిత్యావసర ధరలు అధికంగా ఉండడంతో హోటల్ నిర్వహణ ఖర్చు కూడా పెరిగి ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పుడు ఖర్చులు తగ్గుతాయి.

- షేక్ సందానీ, ఉదయగిరి

బైక్ కొంటాను!



ఎప్పటినుంచో బైక్ కొనాలనుకుంటున్నా. కానీ జీఎస్టీ కారణంగా ధరలు అధికంగా ఉండడంతో కొనుగోలు చేయలేకపోయాను. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ ధరలు తగ్గించడంతో కొత్త బైక్ కొనుగోలు చేస్తా.

- దారపనేని నారాయణ, సర్వరాబాదు, ఉదయగిరి

ఆర్థిక వెసులబాటు



కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో నిత్యవసర వస్తువుల ధరలు తగ్గుముఖం పడితే మాలాంటి దిగువ మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక వెసులుబాటు కలిగినట్టు అవుతుంది. అయితే ప్రస్తుతం వస్తువుల రేట్లు పాత ధరలకే విక్రయిస్తున్నారు. జీఎస్టీ రేట్లు తగ్గింపు పూర్తిస్థాయిలో కొనసాగాలంటే కొన్ని రోజులు పడుతుందని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో ఉన్న రేట్ల ప్రకారమే వస్తువులు అమ్ముతున్నారు.

- నాళం నారాయణరావు, కందుకూరు

- ఆంధ్రజ్యోతి బృందం

సోమశిల జలాశయానికి 37,212 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో హెచ్చు, తగ్గులుగా కొనసాగుతోంది. సోమవారం 35,847 క్యూసెక్కులు వస్తుండగా, డ్యాంలో నీటినిల్వ 72.250 టీఎంసీలకు చేరుకుంది. దిగువకు వదులుతున్న నీటి మోతాదును తగ్గించారు. మూడు గేట్ల ద్వారా 15,000, పవర్ టెన్నల్ ద్వారా 2,600, ఉత్తర కాలువకు 400, కండలేరుకు వరద కాలువ ద్వారా 10,450 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



కార్మిక చట్ట సవరణ బిల్లును రద్దు చేయాలి

● 8 గంటల పని విధానాన్నే అమలు : సీఐటీయూ

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దేశంలో కార్మిక చట్ట సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సీఐటీయూ నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద నిరసన ప్రదర్శన జరిగింది. వారు మాట్లాడుతూ కార్మిక చట్ట సవరణ బిల్లు వల్ల యాజమాన్యాలు కార్మికులను బానిసలుగా చూసే అవకాశం ఉందన్నారు. బ్రిటీష్ వలస పాలకులను ఎదిరించి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని 10 గంటలు చేయటం ప్రభుత్వానికి తగదని హితవు పలికారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వర్గంపై దాడి పెరిగిందన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోర్డ్‌లు తీసుకు రావటం ద్వారా కేంద్రం కార్మికులకు తీరని అన్యాయం చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా దీని అమలుకు పూనుకోవటం కార్మికులకు ద్రోహం చేయటమేనన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో కార్మికుల బిల్లు సవరణకు తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కత్తి శ్రీనివాసులు, ఆర్ శ్రీనివాసులు, బాబూరావు, ఆశోక్, కామాక్షమ్మ, మూలం ప్రసాద్, మధు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇంటి కోసం దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 22 (ఆంధ్ర జ్యోతి) : టిడ్కో ఇల్లు అవసరమున్న వారు దరఖాస్తు అందచేయాలని నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ నందన్ కోరారు. సో మవారం తన కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో పాల్గొన్న ఆయన నగర వాసు ల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఆవాస్ యోజ న 2.0 పథకంలో భాగంగా ఇంటిని మంజూ రు చేస్తారని చెప్పారు. అర్హత కలిగిన వారు సచివాలయాల్లోని కార్యదర్శుల వద్ద దరఖా స్తులు అందచేయాలన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

సమస్యలను పరిష్కరించండి


ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా

గూడూరు అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికలో రెవెన్యూ సమస్యలపై వినతులు వెల్లువెత్తాయి. సోమవారం సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా తన కార్యాలయాయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 19 అర్జీలు అందాయి. ఇందులో ఎక్కువగా రెవెన్యూ సమస్యలే ఉన్నాయి. అలాగే సంక్షేమ పథకాలు అందలేదని కొందరు ఫిర్యాదు చేశారు. తన కుమార్తెకు పెళ్లి సందర్భంగా పసుపు, కుంకుమల కింద ఇరవైనాలుగున్నర సెంట్లు భూమిని రాసిచ్చానని, ప్రస్తుతం అది రెవెన్యూ రికార్డుల్లో నోషనల్ ఖాతాగా నమోదై ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని, నాలుగేళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పరిష్కరించలేదని కోట మండలం గూడలికి చెందిన మండి వెంకటేశ్వర్లురెడ్డి ఫిర్యాదు చేశారు. తన తండ్రి కొవిడ్ సమయంలో చనిపోయాడని, పెన్షన్ కోసం తన తల్లి భూదేవమ్మ ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా, భూమి ఎక్కువ ఉందంటూ పెన్షన్ ఇవ్వలేదని బాలయపల్లి మండలం వెంగమాంబ పురం గ్రామానికి చెందిన బాపనపల్లి కవిత చెప్పారు. తమది కాని భూమి రికార్డుల్లో నమోదు కావడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడంలేదని, ప్రస్తుతం తన తల్లి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, తప్పుగా నమోదైన భూమిని తొలగించి న్యాయం చేయాలని కవిత విజ్ఞప్తి చేశారు.

వేనాడు, పేర్నాడు రోడ్లకు అనుమతులు మంజూరు చేయండి

డిప్యూటీ సీఎంకు ఎమ్మెల్యే విజయశ్రీ వినతి


డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

తడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గం పులికాట్ తీర ప్రాంతంలోని వేనాడు, పేర్నాడు రోడ్లకు అనుమతులు మంజూరు చేయాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు విన్నవించారు. సోమవారం అమరావతిలోని శాసన సభలో డిప్యూటీ సీఎంను ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే విజయశ్రీ కలిసి పలు సమస్యలను వివరించారు. ముఖ్యంగా వేనాడు, పేర్నాడు రోడ్ల దుస్థితిని వివరించారు. సుమారు 15 గ్రామాలున్న ఈ ప్రాంతం పులికాట్ సరస్సు మధ్యలో ఉండటంతో చిన్న అభివృద్ధి పనికైనా అటవీశాఖ వన్యప్రాణి విభాగం అధికారులు అభ్యంతరం చెబుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దశాబ్దాలుగా మట్టి రోడ్డులోనే ప్రజలు ప్రయాణించాల్సి వస్తోందన్నారు. అలాగే దొరవారిసత్రం మండలం మీజూరు వద్ద చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి సైతం ఇవే అడ్డంకులు ఉన్నాయని, అక్కడ భూగర్భజలాలు సైతం ఉప్పునీళ్లుగా మారిపోయాయన్నారు. చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తే సమీప గ్రామాల ప్రజలకు తాగు, సాగునీటికి ఇబ్బందులు ఉండవని చెప్పుకొచ్చారు. అక్కడ ప్రజల దుస్థితిని తెలిపే ఫొటోలను, నివేదికలను, వినతిపత్రాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు అందజేశారు. వీటిని పరిశీలించిన డిప్యూటీ సీఎం త్వరలోనే సంబంధిత శాఖల నుంచి అనుమతులు ఇప్పించేలా ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.

ఆరోగ్యకర మహిళతో శక్తివంతమైన కుటుంబం


కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ హేమ

వాకాడు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకర మహిళ శక్తివంత మైన కుటుంబాన్ని, సమాజాన్ని నిర్మించగలదని డాక్టర్ హేమ అన్నారు. మండలంలోని కొండాపురం అంగన్‌వాడీ పాఠశాలలో స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వస్థనారీ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాల్లో గుండె జబ్బులు, క్యాన్సర్‌కు సంబంధించి పరీక్షలు నిర్వహిస్తున్నా మన్నారు. రక్తహీనత, పోషకాహారంపై ప్రతి మహిళ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికా హార పదార్థాల స్టాల్స్‌పై మహిళకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్‌నాయుడు, అంగన్‌వాడీ సిబ్బంది శిరీషా, సాయమ్మ, శాంతి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

పెళ్లకూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని నాయుడుపేట క్లస్టర్ సూపర్‌వైజర్ సాయిలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని పెళ్లకూరుమిట్ట గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణమాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు రోజువారి ఆహారంలో తాజా ఆకు కూరలు, కూరగాయలతో పాటు సీజనల్ పండ్లు తీసుకోవాలన్నారు.

ఎంపీడీవోకు సత్కారం


ఉమామహేశ్వర్‌రావును సన్మానిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులు, సిబ్బంది

వాకాడు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): వాకాడు డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తూ పదోన్నతిపై చిట్టమూరు ఎంపీడీవోగా బదిలీపై వెళ్తున్న ఉమా మహేశ్వర్‌రావును ఎంపీడీవో శ్రీనివాసులు, అధికారులు సత్కరించారు.

వెంకటగిరి మున్సిపల్ డీఈ మృతిపై విచారణ జరపాలి

మాల యువసేన రాష్ట్ర అధ్యక్షుడు చైతన్య

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మున్సిపల్ డీఈ రాయపూడి శ్రీధర్ మృతిపై విచారణ జరపాలని మాల యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొందుగల చైతన్య డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మృతుడి సోదరుడు పూర్ణచంద్ర కళాధరరావుతో కలిసి ఆయన మాట్లాడారు. శ్రీధర్ శరీరంపై గాయాలతో అద్దెకు ఉంటున్న ఇంట్లో గత నెల 20న అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు తెలిపారు. శ్రీధర్ భార్య సరళశ్రీ తన సోదరి పద్మశ్రీ, అక్క కుమారుడు సిద్ధూ, మరికొందరితో కలిసి హత మార్చిందనే అనుమానాలున్నాయని ఆరోపించారు. శ్రీధర్ మృతి అనుమానాస్పదమని కమిషనర్ ధృవీకరించినా పోస్టుమార్టం చేయించకుండా విజయవాడకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారని చెప్పారు. సమగ్ర విచారణ జరిపి, నిజానిజాలను నిగ్గుతేల్చాలని శ్రీధర్ సోదరుడు కోరారు. సమావేశంలో చప్పిడి వెంగళయ్య, కాలం హరికృష్ణ, రవిరాజు పాల్గొన్నారు.


గుడూరు: బాలత్రిపురసుందరీదేవిగా విజయదుర్గాదేవి - సూళ్లూరుపేట: ప్రత్యేక అలంకరణలో పార్వతీదేవి


చిల్లకూరు: రాజరాజేశ్వరిగా ముత్యాలమ్మ - సౌభాగ్యలక్ష్మిగా ఆదిలక్ష్మి


నాయుడుపేట: ప్రత్యేక అలంకరణలో మూకాంబికాదేవి - వాకాడు: చతుర్భుజ మహాలక్ష్మి


గొల్లలములువు నుంచి సారె తీసుకొస్తున్న గ్రామస్తులు - చెంగాలమ్మ ఆలయంలో కలశ స్థాపన చేస్తున్న సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి

కలశ స్థాపనతో శరన్నవరాత్రులు ప్రారంభం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో దేవినవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం వేదపండితులు, మంత్రోచ్ఛరణల నడుమ కాళంగి నది జలాలు తెచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి కలశ స్థాపన చేశారు. అనంతరం సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి చేతుల మీదుగా ఆఖండ జ్యోతిని వెలిగించి అమ్మవారి అంతరాలయంలో పెట్టి ఉత్సవాలను ప్రారంభించారు. తరువాత ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి మహా చండీయాగం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి పుట్టినిల్లు గొల్లలములువు నుంచి మేళతాళాలు. బాణసంచా పేలుళ్ల నడుమ సారె తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. శింగన ఓబుల్‌రెడ్డి, పద్మజారెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు వేనాటి రామచంద్రా రెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, వేనాటి సురేష్‌రెడ్డి, పర్వత రెడ్డి చంద్రారెడ్డి, నాపా మునిరాజా, గండవరం రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే నాగేశ్వరస్వామి ఆలయంలోని పార్వతీదేవి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, పాలక మండలి సభ్యులు ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు కన్యకా పరమేశ్వరి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉరిమి బాలాజీ, అలవల వెంకటసుబ్బారావు, బ్రహ్మానందం దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

గూడూరు: పట్టణంలోని సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో కలశస్థాపనతో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్థానిక గ్రామదేవత తాళమ్మ ఆలయంలో విజయదుర్గాదేవి ఉపపీఠం నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ స్వామి పూజలు నిర్వహించి కలశాన్ని నెత్తిపై ఉంచుకుని సాయిసత్సంగ నిలయానికి తీసుకొచ్చారు. అదేవిధంగా పట్టణంలోని నారాయణమ్మపెంరంత్రాళ్లు, మహాలక్ష్మమ్మ, కన్యకా పరమేశ్వరి, రాజరాజేశ్వరిదేవి, గంగమ్మదేవి, బజారుకలిశం తదితర ఆలయాల్లో అమ్మవారి కలశ స్థాపనతో శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు.

చిల్లకూరు: తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ రాజరాజేశ్వరిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అర్ధరథంపై గ్రామోత్సవం జరిపారు. కలకొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలోని ఆదిలక్ష్మీదేవిని సౌభాగ్యలక్ష్మిగా అలంకరించారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని అమ్మవారి ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. వాసవి కన్యకాపరమేశ్వరికి స్వర్ణ కవచ అలంకారం, కర్ణకమ్మ వీధిలోని హరహర క్షేత్రంలో వెలసిన కాత్యయనీదేవిని అర్ధనారీశ్వరిగా, వెంకటేశ్వరస్వామిని మత్స్యావతారంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

కోట: విద్యానగర్‌లోని విద్యాగణపతి ఆలయ ప్రాంగణంలో గల లక్ష్మీదేవిని బాలత్రిపురసుందరిదేవిగా అలంకరించారు. తన్నమాల వెంకటకృష్ణారెడ్డి, గీతమ్మ దంపతులతో పాటు డాక్టర్ హస్వంత్‌రెడ్డి ఉభయదాతలుగా వ్యవహరించారు. అదేవిధంగా కోటలోని వాసవీ కన్యకా పరమేశ్వరిని భవానీదేవిగా అలంకరించారు. ఆర్యవైశ్యసంఘ నాయకులు కలశ పూజ చేశారు. గ్రామదేవత కోటమ్మను బాలత్రిపుర సుందరిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని అమ్మవారి ఆలయాల్లో సోమవారం శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మూకాంబికా దేవి, దుర్గాదేవి, మానసాదేవి, అంకమ్మ, గ్రామదేవత పోలేరమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాకాడు: సిద్దిగుంటపాళెంలోని చతుర్భుజ మహాలక్ష్మి ఆలయంలో ప్రధానార్చకులు పవన్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు, గణపతిపూజ, కుంకుమార్చన నిర్వహించారు. సురేంద్రబాబు, సౌజన్య ఉభయకర్తలుగా వ్యవహరించారు.


వెంకటగిరి: అర్ధనారీశ్వరి అలంకారంలో కాత్యయనీదేవి, మత్స్యావతారంలో వెంకటేశ్వరస్వామి, స్వర్ణ కవచంలో కన్యకాపరమేశ్వరి - కోట: బాలత్రిపుర సుందరిదేవిగా లక్ష్మీదేవి, కోటమ్మ, భవానీదేగా కన్యకాపరమేశ్వరి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంగాళమ్మ ఆలయ సమీపంలో ఉన్న సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా శ్రీనగర్ కాలనీ, పార్కువీధి, కచ్చేరివీధి, పరమేశ్వరినగర్, బ్రాహ్మణవీధి, గణపతి నగర్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండవని పట్టణ ఏఈ మోహిని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం

చిల్లకూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పగుంటపాళెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం అంగన్‌వాడీ సూపర్ వైజర్ రేణుకమ్మ ఆధ్వర్యంలో పోషణ మాసం నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుకమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులు, గర్భిణులకు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మి, ప్రభావతి, పెంచలమ్మ, సులోచన, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

చేనిగుంటలో ఉచిత వైద్య శిబిరం

తడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చేనిగుంటలో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం సోమవారం జరిగింది. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ప్రారంభించిన స్వసక్తి నారీ పరివార్ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ వాకాటి బుజ్జమ్మ, తడ పీఏసీఎస్ అధ్యక్షుడు వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు చిల్లకూరు తేజారెడ్డి, జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, నాయకులు రమేష్, బాలసుబ్రహ్మణ్యం, మనోజ్, పీహెచ్‌సీ డాక్టర్ కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్యామసుందరపురంలో...

కోట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని శ్యామసుందరపురంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం జరిగింది. కోట, చిట్టేడు ప్రభుత్వాస్పత్రుల వైద్యాధికారులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, నాయకులు నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు సురేష్, తిరుమల శెట్టి కోటేశ్వరరావు, సుహాసిని, షంషుద్దీన్, డాక్టర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

పెళ్లకూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సీజన్ ప్రారంభం కానుండడంతో రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని ఎన్డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారయణరెడ్డి కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని మండలంలోని రైతులకు సరిపడే యూరియాను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

నేత్రదానం


రామ్మూర్తి (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సర్వారెడ్డి కండ్రిగకు చెందిన జమ్మి రామ్మూర్తి(85) మరణాంతరం ఆయన కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రాలను దానం చేశారు. సూళ్లూరుపేటకు చెందిన ఆచార్య భరద్వాజ సేవాసంస్థ ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించి చెన్నై శంకర్ నేత్రాలయకు అందజేశారు.


ఓట్ల చోరీతోనే మోదీకి అధికారం: కాంగ్రెస్

సూళ్లూరుపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఓట్ల చోరీతోనే అధికారం చేజిక్కించుకున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలగురం బాబు ఆరోపించారు. ఓట్ల చోరీ, ఓటర్ల జాబితా అవకతవకలకు నిరసనగా సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండు సెంటర్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మామందూరు వెంకటాచలపతి, భాస్కర్‌రెడ్డి, బాలరాజురెడ్డి, జానకి రాము, వెంకటరత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నాయుడుపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. పట్టణంలోని రామకృష్ణాపురానికి చెందిన జూనేద్ ఈనెల 14వ తేదీ మద్యంలో గడ్డిమందు కలుపుకొని ఆత్మహత్యయత్నం చేశారు. స్థానికులు, బంధుమిత్రులు గమనించి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నై తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ జూనేద్(22) మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

వైభవంగా ఆంజనేయస్వామి గ్రామోత్సవాలు


ఆంజనేయస్వామి గ్రామోత్సవం


గ్రామోత్సవంలో బేతాళనృత్యాలు

గూడూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అంజనేయస్వామి గ్రామోత్సవాలు ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు వైభవోపేతంగా కొనసాగాయి. ఆదివారం పట్టణంలోని వీధుల్లో స్వామివారి జెండాలను ట్రాక్టర్‌పై అలంకరించి పోటాపోటీగా గ్రామోత్సవాలు నిర్వహించారు. రాత్రి ఆంజనేయస్వామి జెండాలను ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్లపై ఉంచి తీన్‌మార్ బ్యాండ్లు, తెనాలిబ్యాండ్లు, బేతాళ నృత్యాలు, యువత చిందుల నడుమ సోమవారం ఉదయం ఊరేగించారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ గీతాకుమారి ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



